

తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365



TGTEL/26/A6221

# తొలి వెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA



**విలేకరులు కావలెను**

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365



| యాదాద్రిభువనగిరి | సంపుటి: 01 | సంచిక.46 | శుక్రవారం | 11.సెప్టెంబర్.2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue.46 | Friday | 11.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |


# సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై ప్రజలకు వివరించాలి
- సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కుట్ర చేసింది
- అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో పాల్గొనాలి
- ఓటు హక్కు పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలి
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్:** ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిం చేందుకు సభ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ సజావుగా సాగకుండా అడ్డుకునేందుకు కుట్ర చేసిందని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన జరిగిన సీఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు ఆయన దిశానిర్దేశం చేశారు. డిప్యూటీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశంలో పాల్గొన్నారు.

### సభ్యులకు సీఎం అభినందనలు

అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు అహంకారం వీడలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజులపాటు సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగించారని ఆరోపించారు. అధికారుల పట్ల అనుచితంగా వ్యవహరించడంతో పాటు మహిళా అధికారుల ఎదుట టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారని, శాసనసభాపతిని అభ్యంతరకరంగా దూషించారని మండిపడ్డారు. ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించిన సందర్భంలో దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని గుర్తు చేశారు. ప్రతిపక్షం చేసిన కుట్రను సమర్థంగా తిప్పికొట్టి, ప్రభుత్వంపై జరిగిన ప్రచారాన్ని ప్రజలకు వివరించినందుకు పార్టీ సభ్యులను సీఎం అభినందించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతి సభ్యుడు తప్పనిసరిగా చర్చల్లో పాల్గొనాలని, హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన పదవులు, బాధ్యతలను సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. వ్యక్తిగత పనితీరు, సభలో వ్యవహరించే తీరు భవిష్యత్తులో రాజకీయంగా కీలక ప్రభావం చూపుతాయని ఎమ్మెల్యేలకు సూచించారు.

### 'సర్‌పై అప్రమత్తంగా ఉండాలి'

ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యేగా మరోసారి గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ నమూనాను అనుసరించి దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

### కాంగ్రెస్‌కు నష్టం చేసే ప్రయత్నాలు వద్దు

అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో సమర్థంగా ప్రస్తావించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయంగా ఎదిగి.. అదే పార్టీకి నష్టం కలిగించేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవకాశం కల్పించకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి నాయకులు రాష్ట్రస్థాయిలో ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీసు సిబ్బందిలోనూ కేటీఆర్ కనిపించినట్లుగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరించారని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆగ్రహంతో అధికారులపై దాడులకు పాల్పడటం తరువాయి 2లో

## ఉద్యోగులకు గుడ్ న్యూస్



- సమస్యలపై సీఎం సానుకూల స్పందన
- ఆరు డీఏలపై త్వరలో ప్రకటన
- పీఆర్‌సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు
- ఒక్కో సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం
- ఉద్యోగ సంఘాల జేఏసీకి రేవంత్‌రెడ్డి హామీ

**ప్రజానావ, హైదరాబాద్:** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ ఆహ్వానం మేరకు జేఏసీ నేతలు సీఎంను కలిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందిపై పెరుగుతున్న పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పీఆర్‌సీ తరువాయి 2లో



## తక్కువ వ్యయంతో అత్యుత్తమ ప్రయోగాలు

- తరతరాల శాస్త్రవేత్తల కృషితోనే ప్రపంచ గుర్తింపు
- అంతరిక్షంలో భారత్ జోరు
- 2035లో అంతరిక్ష కేంద్రం.. 2040లో చంద్రుడిపై భారతీయుడు
- తొలి అంతర్జాతీయ అంతరిక్ష సదస్సులో ప్రధాని మోదీ

2

**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సాధిస్తున్న విజయాలు, ప్రపంచవ్యాప్తంగా దానికి లభిస్తున్న గుర్తింపు వెనుక తరతరాలుగా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు చేసిన కఠోర శ్రమ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇస్రో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. పారిస్‌లో గురువారం జరిగిన తొలి అంతర్జాతీయ అంతరిక్ష సదస్సును ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. తక్కువ వ్యయంతో అత్యుత్తమ అంతరిక్ష ప్రయోగా లను నిర్వహిస్తూ ఇస్రో ప్రపంచ ప్రశంసలు అందుకుంటోందని మోదీ అన్నారు. అంతరిక్ష సాంకేతికతలు రైతులు, మత్స్యకారులకు ఉపయోగ పడటంతోపాటు వాతావరణ అంచనాలు, విపత్తుల నిర్వహణ, నావిగేషన్ వంటి కీలక రంగాలకు సేవలందిస్తున్నాయని తెలిపారు. భారత రాకెట్ల ద్వారా ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 430కు పైగా ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపినట్లు వెల్లడించారు. చంద్రయాన్–3 విజయాన్ని ప్రస్తావిస్తూ.. చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని ప్రధాని గుర్తుచేశారు. సూర్యుడి రహస్యాలను అధ్యయనం తరువాయి 2లో

## అబూ సలేంకు సుప్రీంలో చుక్కెదురు

2


- 25ఏళ్ల జైలు శిక్ష పూర్తయిందంటూ విడుదల కోరిన పిటిషన్ కొట్టివేత
- పోర్చుగల్‌కు ఇచ్చిన హామీతో జీవిత ఖైదు 25 ఏళ్ల శిక్షగా మారదు
- ఒకే కాలాన్ని రెండుసార్లు లెక్కించలేం: అత్యున్నత ధర్మాసనం



## బ్రిక్స్ సదస్సుకు ఢిల్లీ ముస్తాబు

- పుతిన్, జిన్‌పింగ్, పెజెష్కియాన్ రాక
- 7 వేల మంది భద్రతా సిబ్బంది మోహరింపు

6



## ఫిలిప్పీన్స్‌లో ఘోర ఫెర్రీ ప్రమాదం

- మంటల్లో చిక్కుకున్న ప్యాసింజర్ ఫెర్రీ
- ఐదుగురు మృతి, 87 మంది గల్లంతు

6

## లక్ష్మీనారాయణ చెరువును కాపాడండి!

2

- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు స్థానికులు, మత్స్యకారుల విజ్ఞప్తి
- 600 ఎకరాలకుపైగా విస్తీర్ణం.. కాలుష్యంతో చేపలు మృత్యువాత
- జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వ్యర్థాలే ప్రధాన కారణమని ఆరోపణ

## రిజర్వాయర్లపై ఫ్లోటింగ్ సోలార్!

- నాగార్జునసాగర్, శ్రీశైలం సహా ప్రధాన జలాశయాలపై పరిశీలన
- ఒక్క మెగావాట్‌పై రూ.1.30 కోట్ల అదనపు భారం
- విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరింది
- అబ్రూబాద్‌లో 80 గ్రామాల సోలరైజేషన్‌కు పైలట్ ప్రాజెక్టు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2





## దోపిడీని ప్రశ్నిస్తామనే బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్!

2

- రూ.200 కోట్ల భూమిని సీఎం సోదరుడి కంపెనీకి ఎలా ఇచ్చారు?
- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో రేవంత్ కుటుంబమే బాగుపడింది
- ఫ్యూచర్ సిటీపై రంగారెడ్డి జిల్లాలో సదస్సులు.. న్యాయపోరాటం
- సస్పెన్షన్ ఎత్తివేస్తే వెంటనే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరెంటు కోతలు

- కేసీఆర్ హయాంలోని 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఎక్కడ?
- బీఆర్ఎస్ కార్యానిర్వహణ అధ్యక్షుడు కేటీఆర్
- సీఎం సొంత గ్రామంలోనే రైతుల కష్టాలు.. ఎక్స్‌లో వీడియో

## కేటీఆర్, హరీశ్‌రావుపై కేసు

- మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన
- నలుగురు బీఆర్ఎస్ నేతలపై సైఫాబాద్ పోలీసుల ఎఫ్ఐఆర్
- దర్యాప్తు చేపట్టిన పోలీస్ అధికారులు

2

## కమిటీ పునర్వ్యవస్థీకరణకు నో

- మా చేతిని మేం అనుమానించం.. కమిటీపై పక్షపాత ముద్ర వద్దు
- లోపాలుంటే చెప్పండి.. బహిరంగ విచారణ చేపడతాం: సుప్రీంకోర్టు
- ప్రజల నుంచి అభిప్రాయాలు, ఆధారాలు స్వీకరించేందుకు బహిరంగ ప్రకటన
- కమిటీ సభ్యులపై అభ్యంతరాలను పరిశీలిస్తామన్న ధర్మాసనం
- విద్యార్థికి నోటీసిచ్చిన అధికారి సస్పెన్షన్
- సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా

2



## జిన్‌పింగ్ భారత్ పర్యటన ఖరారు!

- బ్రిక్స్ సదస్సుకు హాజరుకానున్న చైనా అధ్యక్షుడు
- రేపు, ఎల్లుండి ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు
- జిన్‌పింగ్ రాకపై తొలగిన సస్పెన్స్.. అధికారికంగా వెల్లడించిన చైనా
- మోదీ,జిన్‌పింగ్ భేటీకి అవకాశం.. ద్వైపాక్షిక అంశాలపై చర్చకు ఛాన్స్

2



## పంచాయతీల ఆదాయం బ్యాంకు ఖాతాల్లోనే!

- పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం
- ట్రెజరీ నుంచి నిధుల డ్రా ప్రక్రియకు స్వస్తి.. గ్రామ అవసరాలకు నిధుల వినియోగం సులభం
- కేంద్రం నుంచి రూ.619 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉంది
- పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

2

## సీఎంతో భేటీకి రాజకీయ రంగు పులమొద్దు!

2



- అభివృద్ధి, నిధుల కోసం సీఎం, డిప్యూటీ సీఎంను కలవడం తప్పా?
- రేవంత్‌తో అభిప్రాయ భేదాలు సహజమే.. పదవి కోసం లొంగిపోయాననడం అవాస్తవం
- మంత్రి పదవుల విస్తరణపై నిర్ణయం అధిష్టానానిదే: మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

## తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

- ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే మంత్రి.. గతంలో ఇలాంటి వారిని చూడలేదు'
- పార్టీలు వేరైనా మంచి పనిని మెచ్చుకోవడంలో తప్పులేదు: పాయల్ శంకర్, రాకేశ్‌రెడ్డి
- సమస్య పరిష్కారం వరకు అధికారులతో మాట్లాడటం తుమ్మల ప్రత్యేకత అని వెల్లడి

2

# ఉద్యోగులకు గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా వివరించారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి అంశాన్ని ఆయనకు తెలియజేశారు.

### 'ఉద్యోగుల పక్షానే ఉంటా'

ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘంగా చర్చించినట్లు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (టీఆర్‌ఈఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్‌రెడ్డి తెలిపారు. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని సీఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. పీఆర్‌సీ కమిటీ నివేదికను కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం చెప్పినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

### టీఆర్‌ఈఎస్‌ఏ హర్షం

ఉద్యోగుల సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్‌ఈఎస్‌ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని సంఘం నేతలు తెలిపారు.సీఎంను కలిసిన వారిలో టీఆర్‌ఈఎస్‌ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

సరికాదన్నారు. ప్రతి ఎమ్మెల్యే పనితీరు, ప్రవర్తనను ప్రజలు గమనిస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ సమస్యలను సభలో ప్రస్తావించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరి వ్యక్తిగత పనితీరు వచ్చే ఎన్నికల్లో గెలుపోటములపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీఎల్పీ సభ్యులకు సూచించారు.

# అబూ సలేంకు సుప్రీంలో చుక్కెదురు

**న్యూఢిల్లీ:** ముంబయి 1993 వరుస బాంబు పేలుళ్ల కేసులో దోషి, గ్యాంగ్‌స్టర్ అబూ సలేంకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. భారత్‌లో 25 ఏళ్ల జైలు శిక్ష పూర్తయిందని, తనను విడుదల చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం బాంబే హైకోర్టు తీర్పును సమర్థించింది. పోర్చుగల్ నుంచి 2005 నవంబర్ 11న సలేంను భారత్‌కు అప్పగించారు. అప్పగింత సమయంలో భారత్–పోర్చుగల్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం సలేంకు మరణశిక్ష విధించకూడదు. 25 ఏళ్లకు మించి జైలులో ఉంచకూడదని భారత ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఈ హామీతో సలేంకు విధించిన జీవిత ఖైదు 25 ఏళ్ల కాలపరిమితి శిక్షగా మారదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2022 జూలై 11న ఇచ్చిన తీర్పులో సలేం శిక్షా కాలాన్ని లెక్కించేందుకు 2005 అక్టోబర్ 12ను ప్రారంభ తేదీగా నిర్ణయించిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. రెండు వేర్వేరు కేసుల్లో విధించిన జీవిత ఖైదు శిక్షలు ఏకకాలంలో అమలు కావాలని ఆదేశించినందున, ఒకే కాలం జైలు శిక్షను రెండుసార్లు లెక్కించలేమని పేర్కొంది. అలా లెక్కించడం చట్టపరమైన ఆధారం లేని విధంగా జైలు కాలాన్ని కృత్రిమంగా పెంచడమేనని వ్యాఖ్యానించింది.

### పోర్చుగల్‌కు ఇచ్చిన హామీపై..

సలేంను మరణశిక్షకు గురిచేయబోమని, 25 ఏళ్లకు మించి జైలులో ఉంచబోమని పోర్చుగల్‌కు భారత్ ఇచ్చిన హామీని 2022 తీర్పులోనే సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుందని ధర్మాసనం తెలిపింది. అయితే ఆ హామీ ఆధారంగా జైలు శిక్షను కృత్రిమంగా లేదా వేగవంతంగా లెక్కించి విడుదల కోరే హక్కు సలేంకు లేదని స్పష్టం చేసింది. 1993 ముంబయి వరుస పేలుళ్ల వంటి దేశ ఆర్థిక, భద్రతా వ్యవస్థను దెబ్బతీసే తీవ్ర నేరాల విషయంలో వాటి ప్రభావాన్ని విస్మరించలేమని ధర్మాసనం పేర్కొంది. బాంబే హైకోర్టు తీర్పులో ఎలాంటి లోపం లేదని తేల్చి, సలేం అప్పీల్‌ను కొట్టివేసింది.

# కేటీఆర్, హరీశ్‌రావుపై కేసు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు సహా నలుగురు బీఆర్‌ఎస్ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నంబర్–3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. అదే సమయంలో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్‌ఎస్ నేతలు రాజకీయ నినాదాలతో కూడిన నల్ల టీ–షర్టులు ధరించి, ప్లకార్డులతో అక్కడికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనల ప్రకారం వాటికి అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో బీఆర్‌ఎస్ నేతలు తమను దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు తమను అవమానకర రీతిలో దూషించారని మహిళా కానిస్టేబుల్ ఆరోపించారు. హరీశ్‌రావు తన టీ–షర్టును విప్పి పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది సమక్షంలో అసభ్యకరంగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా తమతో దురుసుగా వ్యవహరించి ఇబ్బందులకు గురిచేశారని ఆమె ఆరోపించారు.

### కేసు నమోదు.. దర్యాప్తు

మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు లైంగిక వేధింపులు, దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం తదితర ఆరోపణలకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# లక్ష్మీనారాయణ రువును కాపాడండి!

**హైదరాబాద్:** ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామంలోని చారిత్రక లక్ష్మీనారాయణ చెరువును పరిరక్షించి అభివృద్ధి చేయాలని స్థానికులు, మత్స్యకారులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం రంగనాథ్ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త, హైడ్రా అదనపు కమిషనర్ డి. ఆనంద్‌కుమార్‌తో కలిసి చెరువును సందర్శించారు. గణేశ్ నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హైడ్రా కమిషనర్‌ను కలిసి చెరువు చరిత్రను వివరించారు. గతంలో 600 ఎకరాలకు పైగా విస్తరించి తాగు, సాగునీటి అవసరాలను తీర్చిన ఈ చెరువు ప్రస్తుతం తీవ్ర కాలుష్యానికి గురైందని తెలిపారు. చెరువు నీటిని తాకితే చేతులకు జిగురులా అంటుకునే స్థాయిలో కాలుష్యం ఉందని, దీంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.జవహర్‌నగర్ డంప్‌యార్డు నుంచి వచ్చే వ్యర్థాలు, మురుగునీరు చెరువులో కలవడం వల్లే పరిస్థితి దారుణంగా మారిందని స్థానికులు ఆరోపించారు. జవహర్‌నగర్ నుంచి వచ్చే మురుగునీరు చెరువులోకి చేరకుండా నాలాను మళ్లిస్తే సమస్య చాలావరకు పరిష్కారమవుతుందని సూచించారు.

### 'చెరువును అభివృద్ధి చేయాలి'

నగరంలోని పలు చెరువులను హైడ్రా అభివృద్ధి చేయడంతో పరిసరాల రూపురేఖలు మారుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. అదే తరహాలో ఏదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువును కూడా పునరుద్ధరించి అభివృద్ధి చేయాలని కోరారు.చెరువు చుట్టుపక్కల బోర్లలో కలుషిత నీరు వస్తోందని, దీంతో ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. చారిత్రక నేపథ్యం ఉన్న చెరువును పరిరక్షించేందుకు త్వరలో సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చారు.

# దోపిడీని ప్రశ్నిస్తామనే బీఆర్‌ఎస్ సభ్యుల సస్పెన్షన్!

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్ణయాలు, భూకేటాయింపులపై ప్రశ్నిస్తున్నందుకే బీఆర్‌ఎస్ సభ్యులను శాసనసభ నుంచి సస్పెండ్ చేశారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ముఖ్యమంత్రి కుటుంబం మాత్రమే లబ్ధి పొందిందని విమర్శించారు. సుమారు రూ.200 కోట్ల విలువైన భూమిని సీఎం సోదరుడికి చెందిన కంపెనీకి ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ఈ అంశంపై తాము ప్రశ్నిస్తే విషయాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే అసెంబ్లీ నుంచి బయటకు పంపారని ఆరోపించారు.

అనుముల సోదరులపై తాము చేస్తున్న ఆరోపణల విషయంలో భాజపా ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో కంపెనీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ''దోచుకున్నది అంతరిక్షంలో దాచుకునేందుకే ప్రయత్నిస్తున్నట్లుంది'' అంటూ విమర్శించారు.ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు బలిపశువులు కావొద్దని కేటీఆర్ సూచించారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు రంగారెడ్డి జిల్లాలోని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

### 'అన్ని మార్గాల్లో పోరాటం'

ఫ్యూచర్ సిటీ, భూకేటాయింపుల అంశాలపై న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామని కేటీఆర్ వెల్లడించారు. అన్ని ప్రజాస్వామ్య, న్యాయపరమైన మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే ఈ వ్యవహారంపై ఈడీ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా భూములను పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తామని




అన్నారు. తమపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తే నేరుగా అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొంటామని స్పష్టం చేశారు.

### 'ఫేక్ ఖాతాపై పోలీసులకు ఫిర్యాదు'

సీఎం టీమ్ పేరుతో ఉన్న ఫేక్ ఖాతాను అసెంబ్లీలో ప్రస్తావించి సభను తప్పుదోవ పట్టించారని కేటీఆర్ ఆరోపించారు. ఆ ఫేక్ ఖాతాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు కూడా ఇస్తామని వెల్లడించారు. ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయడం ద్వారా ప్రభుత్వం ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటోందని కేటీఆర్ విమర్శించారు.

# కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరెంటు కోతలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో విద్యుత్ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అందించిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో రాష్ట్రంలో మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు విద్యుత్ సమస్యలపై తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియోను కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పంచుకు న్నారు. ''కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?'' అని కేటీఆర్ తన పోస్టులో ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి పాలమూరు జిల్లాలో, ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనే రైతులు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సరిపడా వోల్టేజ్ లేకపోవడంతో పాటు సమయానికి విద్యుత్ సరఫరా కాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ ఆరోపిం చారు. పొలాలకు నీరు అందక పంటలు ఎండిపో తున్నాయని, తక్కువ వోల్టేజీ కారణంగా విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు. రైతులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని కేటీఆర్ విమర్శించారు.



# తక్కువ వ్యయంతో మంచి ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు చేపట్టిన ఆదిత్య–ఎల్1 మిషన్ కీలక పరిశోధనలు కొనసాగిస్తోందన్నారు. గత ఏడాది ఓ భారతీయుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.

### ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం

2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, 2040లో భారతీయుడిని చంద్రుడిపైకి పంపడం తమ లక్ష్యాలని మోదీ వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ చేపట్టే ప్రతి ప్రయత్నం ద్వారా లభించే ప్రయోజనాలు యావత్ మానవాళికి చేరేలా చూడడమే తమ మార్గదర్శక సూత్రమని స్పష్టం చేశారు. ఇస్రోతో పాటు దేశంలోని ప్రైవేటు అంతరిక్ష రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని తెలిపారు. ప్రైవేటు సంస్థల ఔత్సాహికత, ఇస్రో సాంకేతిక నైపుణ్యం కలసి భారత అంతరిక్ష రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నాయని పేర్కొన్నారు.

# రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్'!

**హైదరాబాద్:** తెలంగాణలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను సిద్ధం చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లపై తేలియాడే సౌర విద్యుత్ కేంద్రాలు (ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్లు) ఏర్పాటు చేసే అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ విద్యుత్ ప్రాజెక్టులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

### ప్రధాన జలాశయాలపై పరిశీలన

నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయా? అనే అంశంపై నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా పరిశీలిస్తున్నాయని భట్టి తెలిపారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని పెంచే దిశగా ఈ ప్రాజెక్టులు కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు. అయితే ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం ప్రధాన సవాల్‌గా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, సుంకాల కారణంగా ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ.1.30 కోట్ల అదనపు భారం పడుతోందని వివరించారు. ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రంలో సోలార్ రంగానికి భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు.

### 19 వేల మెగావాట్లకు విద్యుత్ డిమాండ్

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ రంగం విస్తరణతో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్నారు. పేదలు, రైతులకు అందిస్తున్న విద్యుత్ సబ్సిడీల



కోసం ప్రభుత్వం ఏటా రూ.19 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వెల్లడించారు.

### 80 గ్రామాలకు సౌర విద్యుత్

గిరిజన ప్రాంతాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి తెలిపారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్టును చేపట్టినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో స్వతంత్ర మైక్రో గ్రిడ్లను ఏర్పాటు చేసే అంశంపై కసరత్తు జరుగుతోందన్నారు.ఇళ్లపై, వ్యవసాయ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేలా రైతులు, ప్రజల్లో అవగాహన కల్పించాలని భట్టి విక్రమార్క సూచించారు. భవిష్యత్తులో విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని పెంచేందుకు సోలార్ విద్యుత్ కీలకంగా మారుతుందని పేర్కొన్నారు.

# కమిటీ పునర్వ్యవస్థీకరణకు నో

**న్యూఢిల్లీ:** నీట్ నిరసనల సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అధిక బలప్రయోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు, పోలీసులపై నిరసనకారుల హింసాత్మక చర్యలపై విచారణకు ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల ఉన్నతస్థాయి కమిటీని పునర్వ్య వస్థీకరించేందుకు తాము అంగీకరించబోమని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆర్. సుభాష్‌రెడ్డి నేతృత్వంలోని ఈ కమిటీ పక్షపాతంతో వ్యవహరిస్తుందనే ముందస్తు అభిప్రాయంతో తాము ముందుకు సాగబోమని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం.. ''కమిటీ మా విస్తరించిన చేయి వంటిది. దీనిలో ఎలాంటి మార్పులకూ మేం అంగీకరించం. ఇది సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తుంది. పునర్వ్యవస్థీకరించం. కమిటీ తన పని చేయనివ్వండి. ఎక్కడైనా తప్పు జరిగిందని భావిస్తే మా దృష్టికి తీసుకురండి. బహిరంగ విచారణ నిర్వహిస్తాం'' అని స్పష్టం చేసింది. కమిటీలోని ఈశాన్య రాష్ట్ర మాజీ డీజీపీ ఒకరు దర్యాప్తులోకి వచ్చే అవకాశం ఉన్న ఉన్నతా ధికారికి సన్నిహితుడని, అందువల్ల ప్రయోజనాల సంఘర్షణ ఉందని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కమిటీ స్వతంత్రంగా పనిచేసేందుకు ప్రత్యేక అమికస్ క్యూరీ, అడ్వొకేట్–ఆన్–రికార్డ్ ఉండాలని, ప్రభుత్వ న్యాయవాది ద్వారా కమిటీకి ప్రాతినిధ్యం వహించకూడదని ఆయన కోరారు. ఈ వాదనలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు. ఇలాంటి ఆరోపణలను పట్టించుకోవద్దని కోర్టును కోరారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. ఈశాన్య రాష్ట్రానికి డీజీపీగా పనిచేసినందునే రిటైర్డ్ మేఘాలయ డీజీపీని కమిటీలోకి తీసుకున్నామని, ప్రధాన భూభాగంలోని రాజకీయ పార్టీలకు ఆయన సన్నిహితంగా ఉండే అవకాశం తక్కువని వివరించారు.

### ప్రజల నుంచి ఆధారాల స్వీకరణ

కమిటీ ముందు తమ అభిప్రాయాలు, సమాచారం, పత్రాలు, ఆధారాలు సమర్పించేందుకు ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తూ బహిరంగ ప్రకటన జారీ చేయాలని ధర్మాసనం తెలిపింది. అందిన సమాచారాన్ని కమిటీ పరిశీలిస్తుందని పేర్కొంది. కమిటీ సభ్య కార్యదర్శి రికార్డుల సంరక్షకుడిగా వ్యవహరించి, అందిన మొత్తం సమాచారాన్ని కమిటీ ముందుంచాలని సూచించింది. ఈ బాధ్యతను సాధారణంగా రిటైర్డ్ జిల్లా జడ్జి లేదా ఇతర న్యాయాధికారికి అప్పగించే అవకాశం ఉందని తెలిపింది. కమిటీ పునర్వ్యవస్థీకరణపై న్యాయవాదులు పట్టుబట్టడంతో జస్టిస్ బాగ్చి స్పందిస్తూ.. సంబంధిత సభ్యుడిపై వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిశీలిస్తామని చెప్పారు. అయితే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో, తామే ఎంపిక చేసిన కమిటీలోని సభ్యుడిని ముందుగానే పక్షపాతిగా భావించడం మాత్రం అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఇదిలాఉంటే సీజేఐ నేతృత్వంలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్నందుకు ఓ విద్యార్థికి షోకాజ్ నోటీసు జారీ చేసిన గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ను సస్పెండ్ చేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.

# సీఎంతో భేటీకి రాజకీయ రంగు పులమొద్దు!



**ప్రజానావ,హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తన భేటీపై జరుగుతున్న ప్రచారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెరదించారు. నియోజకవర్గ అభివృద్ధి, నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేముందని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ పెద్దలను కలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలో భాగమని స్పష్టం చేశారు. తన భేటీకి రాజకీయ కారణాలు ఆపాదించవద్దని కోరారు.

### 'మేం ఘర్షణ పడాలని కొందరి కోరిక'

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమేనని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. అయితే రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమేనన్నారు. సీఎం, తన మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయని, మంత్రి పదవి కోసం తాను ముఖ్యమంత్రికి లొంగిపోయానంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు.''ముఖ్యమంత్రిని కలిస్తే లొంగిపోయినట్లు.. కలవకపోతే దూరం పెరిగినట్లు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. నేను, సీఎం ఘర్షణ పడాలని కొందరు ఆశిస్తున్నారు'' అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

### మంత్రి పదవిపై అధిష్ఠానానిదే నిర్ణయం

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, మంత్రి పదవుల అంశం పూర్తిగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పరిధిలోనిదని ఆయన స్పష్టం చేశారు. గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ లభించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని, పార్టీ పెద్దలు తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని తెలిపారు. మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి తప్పు లేదని రాజగోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై సీఎం అధిష్ఠానానికి సరైన సమాచారమే అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకులు, ప్రజాప్రతినిధులకు భిన్నమైన అభిప్రాయాలు ఉండటం సహజమేనన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సాయం స్వల్పమైనది కాదని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రాకేశ్‌రెడ్డి ప్రశంసలు కురిపించారు. రాజకీయంగా పార్టీలు వేరైనా ప్రజలకు మేలు చేసే నాయకుడి పనితీరును, నిబద్ధతను గుర్తించి అభినందించడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు.

### 'అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు'

మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులుగా తాము ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదని అన్నారు.
ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా తుమ్మల వెంటనే స్పందిస్తారని తెలిపారు. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లోనూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన అందుబాటులో ఉంటారని చెప్పారు. సమీక్ష లు, ఇతర అధికారిక కార్యక్రమాల్లో ఉండి ఫోన్ ఎత్తలేకపోయినా.. వీలైనంత త్వరగా తిరిగి ఫోన్ చేసి మాట్లాడటం ఆయన ప్రత్యేకతగా పేర్కొన్నారు.

### సమస్య పరిష్కారం వరకు పర్యవేక్షణ

నియోజకవర్గాలు, ప్రజలకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకెళ్లినప్పుడు తుమ్మల ఎంతో ఓపికగా విని స్పందిస్తారని ఎమ్మెల్యేలు తెలిపారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత అధికారులతో స్వయంగా మాట్లాడి పరిస్థితిని పర్యవేక్షిస్తారని చెప్పారు.పని ఏ దశలో ఉందో, ఎప్పటిలోగా పరిష్కారమవుతుందో కూడా తిరిగి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడం తుమ్మల ప్రత్యేకత అని కొనియాడారు.

### 'ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి'

కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సామర్థ్యం, ఓపిక, జవాబుదారీతనాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పాయల్ శంకర్, రాకేశ్‌రెడ్డి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయాలకు అతీతంగా పనిచేసే నాయకులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

# పంచాయతీల ఆదాయం బ్యాంకు ఖాతాల్లోనే!

**హైదరాబాద్:** గ్రామపంచాయతీల సొంత వనరుల ద్వారా సమకూరే ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ట్రెజరీలో జమ చేయకుండా నేరుగా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 70(3)ను సవరించే బిల్లును పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టగా.. శాసనసభలో చర్చ అనంతరం ఆమోదించింది. ప్రస్తుతం గ్రామప ంచాయతీలు పన్నులు, ఇతర సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వస్తోంది. గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే నిర్దిష్ట ప్రక్రియ ద్వారా ట్రెజరీ నుంచి డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. అనుమతులు, అవసరమైన పత్రాల కారణంగా నిధుల వినియోగంలో కొన్నిసార్లు జాప్యం జరుగుతోందని ప్రభుత్వం తెలిపింది.కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి వచ్చే నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న విధంగానే గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని కూడా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా చట్టాన్ని సవరిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. దీనివల్ల స్థానిక అవసరాలకు నిధులను మరింత వేగంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.54 కోట్లు విడుదల చేస్తోందని సీతక్క తెలిపారు. ఎన్నికలు జరగకపోవడంతో నిలిచిపోయిన కేంద్ర నిధుల్లో ఇంకా రూ.619 కోట్లు రావాల్సి ఉందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రెండేళ్లుగా నిలిచిపో యాయని, ఎన్నికల అనంతరం పెండింగ్ నిధులు క్రమంగా విడుదల అవుతున్నాయని చెప్పారు. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన వీజీజీ రాంజీ పథకం వల్ల రాష్ట్రంపై అదనంగా సుమారు రూ.2,000 కోట్ల భారం పడుతున్నప్పటికీ.. ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) విధానంలో వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. పంచాయతీ రాజ్ చట్ట సవరణపై మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 2018లో స్టాంప్ డ్యూటీని తొలగించడం వల్ల స్థానిక సంస్థలు కొంత ఆర్థిక సంక్షోభంలో పడ్డాయని తెలిపారు. కేంద్రం నుంచి దాదాపు రూ.700 కోట్ల వరకు పెండింగ్ నిధులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. వివిధ కారణాలతో ఎన్నికలు జరగని పంచాయతీలకు ప్రభుత్వమే నిధులు సమకూరుస్తోందని సభకు వివరించారు.



# జిన్‌పింగ్ భారత్ పర్యటన ఖరారు!

**న్యూఢిల్లీ:** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటనపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ రంగ మీడియా సంస్థ జిన్హువా అధికారికంగా వెల్లడించింది.

### 12, 13 తేదీల్లో బ్రిక్స్ సదస్సు

దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. సభ్య దేశాల అగ్రనేతలు ఈ సమావేశానికి హాజరు కానుండగా.. జిన్‌పింగ్ పర్యటనపై మాత్రం కొంతకాలంగా స్పష్టత లేకుండా పోయింది. ఆయన రాకపై చైనా విదేశాంగ శాఖకూ అధికారిక సమాచారం లేదని గతంలో ప్రకటించడంతో సందిగ్ధత నెలకొంది. తాజాగా జిన్హువా ప్రకటనతో స్పష్టత వచ్చింది.

### సరిహద్దు వివాదాల మధ్య పర్యటన

భారత్–చైనా మధ్య సరిహద్దు వివాదాలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. 1962 యుద్ధం అనంతరం ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు కొనసాగగా.. 2020లో గల్వాన్ ఘర్షణతో పరిస్థితి మరింత తీవ్రతరమైంది. అయితే ఇటీవలి కాలంలో రెండు దేశాలు సంబంధాలను మెరుగుపర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. గతేడాది షాంఘై సహకార సంస్థ (SCO) సదస్సుకు ప్రధాని మోదీ హాజరైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, సరిహద్దు అంశాలు తదితర కీలక విషయాలపై చర్చ జరిగే అవకాశముంది.




## మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

- సాయి నగర్‌లో గణనాథుల పంపిణీ
- ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి: చింతల అరుణ

**తొలివెలుగు, నాగోల్ :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని ఆమె సూచించారు. నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ వార్డు కార్యాలయంలో కాలనీవాసులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో తయారైన విగ్రహాల వల్ల నిమజ్జనం సమయంలో నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని అరుణ తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని కోరారు. పర్యావరణ హితమైన వినాయక చవితి వేడుకలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్రీ సాయి నగర్ వార్డు కార్యాలయంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నోటీసులపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నోటీసులు జారీ కావడానికి గల కారణాలు, ఓటరు జాబితాలో తమ వివరాలను ఎలా పరిశీలించుకోవాలి, ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే ఎలా పరిష్కరించుకోవాలనే అంశాలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు భద్రంగా ఉండేలా ఓటర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైతే బీఎల్ఓల సహకారంతో తమ వివరాలను సరిచూసుకుని సందేహాలను నివృత్తి చేసుకోవాలని అరుణ సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జీఎస్ఐ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర వినోద్ రెడ్డి, నాయకులు పంగ శ్యామ్ కుమార్, బద్దం బాలకృష్ణ గౌడ్, డీఈ సందీప్, జవాన్ దర్శన్, ఎస్ఎఫ్ఏ సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి పెళ్లికి ‘ఉప్పల ఫౌండేషన్’ చేయూత

- వధువుకు పుస్తె-మట్టెలు, సారె అందజేత
- పేద కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యం: ఉప్పల శ్రీనివాస్ గుప్తా



**తొలివెలుగు, నాగోల్ / హయత్ నగర్ :** తండ్రి లేని పేదింటి ఆడపిల్ల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ అండగా నిలిచింది. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవ్‌పల్లి గ్రామానికి చెందిన గుండెల్లి యాదమ్మ-కిషన్(దివంగత) దంపతుల కుమార్తె వివాహానికి ఫౌండేషన్ తరఫున ఆర్థిక, వస్తు సహాయం అందించారు. నాగోల్‌లోని ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా నివాసంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వధువుకు పుస్తె-మట్టెలు, చీర, గాజులను స్వయంగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వధూవరులు ఆయురారోగ్యాలతో, అన్యోన్యంగా జీవించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడమే ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. తండ్రి లేని ఆడపిల్ల పెళ్లికి అండగా నిలవడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కో-చైర్మన్ ఉప్పల స్వప్న, లక్ష్మీదేవ్‌పల్లి యువజన సంఘం నాయకుడు కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘హైవే’ పరిహారంలో పోచంపల్లి రైతులకు మొండిచెయ్యి!

- ఎకరానికి రూ.1.20 కోట్లు చెల్లించాలని కనుముకులలో భూనిర్వాసితుల ఆందోళన
- పక్క మండలాల్లో కోట్లు.. ఇక్కడ రూ.24.48 లక్షలా?
- పరిహారంపై స్పష్టత ఇవ్వకుండా పనులు చేపడితే ఊరుకోమని హెచ్చరిక



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** గౌరెల్లి-భద్రాచలం హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న పోచంపల్లి మండల భూనిర్వాసిత రైతులకు ఎకరానికి రూ. 1.20 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని జిల్లా నాయకుడు పాక మల్లేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కనుముకుల గ్రామంలో భూనిర్వాసిత రైతులు హైవే నిర్మాణ పనులను అడ్డుకుని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమ భూములకు చెల్లించనున్న నష్టపరిహారం విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం రంగారెడ్డి జిల్లా రావిరాల గ్రామంలో ఎకరానికి రూ. 1.20 కోట్లు, చౌటుప్పల్ మండలంలో రూ. 1 కోటి, వలిగొండ మండలంలో ఆర్ఆర్ఆర్ రహదారి కోసం ఎకరానికి రూ. 56 లక్షల వరకు నష్టపరిహారం చెల్లిస్తున్నారని తెలిపారు. అయితే పోచంపల్లి మండల రైతులకు మాత్రం ఎకరానికి కేవలం రూ. 24.48 లక్షలు మాత్రమే ఇస్తామని చెప్పడం అన్యాయమని వారు పేర్కొన్నారు. భూముల విలువలు, ప్రాంతాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తమకు సముచిత పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పరిహారం విషయంలో గతంలో కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం సమర్పించి, సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారంపై స్పష్టత ఇవ్వకుండానే హైవే నిర్మాణ పనులు కొనసాగించడం సరికాదని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి భూనిర్వాసిత రైతులతో చర్చించి, నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిహారంపై స్పష్టత రాకుండా పనులు కొనసాగిస్తే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భూనిర్వాసితులు సామ మధుసూదన్‌రెడ్డి, కోట రామచంద్రారెడ్డి, వారాల శేఖర్‌రెడ్డి, బాణాల ఎల్లారెడ్డి, గూడూరు బుచ్చిరెడ్డి, సంకు రవి, సొల్లు నాగరాజు, కంటే లింగస్వామి, పెద్దపల్లి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిని కలిస్తే తప్పేంటి.. మేమిద్దరం తిట్టుకోవాలని చూస్తున్నారు: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

- నియోజకవర్గ నిధుల కోసమే సీఎంను కలిశానన్న రాజగోపాల్ రెడ్డి
- రేవంత్ రెడ్డితో అభిప్రాయ భేదాలు సహజమేనని వెల్లడి
- మంత్రి పదవులపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని స్పష్టీకరణ
- కొండా సురేఖ విషయంలో సీఎం నిర్ణయంలో తప్పులేదని వ్యాఖ్య
- తాను, సీఎం గొడవపడాలని కొందరు చూస్తున్నారని ఆరోపణ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తన భేటీపై సాగుతున్న ప్రచారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెరదించారు. ముఖ్యమంత్రి, తాను ఎప్పుడూ కలహించుకోవాలని కొందరు కోరుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి, నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల నిమిత్తం వారిని కలవడం అనివార్యమని, దీనికి రాజకీయ అర్థాలు ఆపాదించవద్దని కోరారు. ముఖ్యమంత్రితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే అవి సహజమైనవని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పదవి కోసం తాను ముఖ్యమంత్రికి లొంగిపోయినట్లు కొందరు, ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయని మరికొందరు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. “ముఖ్యమంత్రిని కలిస్తే లొంగిపోయినట్లు, కలవకపోతే దూరం పెరిగినట్లు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. నేను, సీఎం ఘర్షణ పడాలని కొందరు ఆశిస్తున్నారు” అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి పదవుల విస్తరణ అంశం పూర్తిగా పార్టీ అధిష్ఠానం పరిధిలోనిదని, గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ లభించినట్లు రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. అధిష్ఠానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. కొండా సురేఖ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరులో ఎలాంటి తప్పు లేదని, ఆయన అధిష్ఠానానికి సరైన సమాచారాన్నే అందించారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భిన్నమైన అభిప్రాయాలు ఉండటం సహజమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయం స్వల్ప మొత్తమేమీ కాదని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

## క్రీడల్లో రాణించి.. ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- వలిగొండలో ఘనంగా మండల స్థాయి క్రీడోత్సవాలు
- వాలీబాల్‌లో విజేతలుగా లోతుకుంట, పులిగిల్ల జట్లు
- గెలుపోటములను సమానంగా స్వీకరించాలి: ట్రాస్మా జిల్లా అధ్యక్షుడు వెంకటేశం గౌడ్

**తొలివెలుగు, వలిగొండ :** విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పవిత్ర ఆత్మ హైస్కూల్ ఆవరణలో ఎంఈవో అధ్యక్షతన మండల స్థాయి క్రీడోత్సవాలు-2026ను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రాస్మా యాదాద్రి జిల్లా అధ్యక్షుడు పాలకూర వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో నిరంతరం సాధన చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని, క్రమశిక్షణతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. అండర్-17 బాలుర విభాగం: లోతుకుంట మోడల్ హైస్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా, టేకులసోమారం జెడ్పీహెచ్ఎస్ ద్వితీయ స్థానాన్ని సాధించింది. అండర్-14 బాలుర విభాగం: పులిగిల్ల జెడ్పీహెచ్ఎస్ ప్రథమ స్థానంలో నిలవగా, వెల్వర్తి జెడ్పీహెచ్ఎస్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. కార్యక్రమంలో పవిత్ర ఆత్మ హైస్కూల్ ప్రిన్సిపల్ సవిత, మండల పాఠశాలల క్రీడా కార్యదర్శులు గంజి చండీదాస్, స్వామిరాజ్, ఎక్కలదేవ్ మల్లేశం, సంధ్యారాణి, రాంప్రసాద్, మహేష్, జయరాణి, ఉపాధ్యాయులు ఐలయ్య, పాల్, పీఈటీ పరశురాం తదితరులు పాల్గొన్నారు.



## 7 కిలోల భారీ తిత్తి తొలగింపు

- సన్‌రైజ్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స
- రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడ



**తొలివెలుగు, హయత్‌నగర్ :** హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఓ మహిళ అండాశయంలో ఏర్పడిన సుమారు 7 కిలోల భారీ తిత్తి (ఓవరియన్ సిస్ట్)ను శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. జనరల్ సర్జన్ డాక్టర్ స్వరణ్‌దీప్, మత్తు వైద్యులు డాక్టర్ జయకృష్ణ, ఓటీ అసిస్టెంట్ కలకొండ మధులతో కూడిన వైద్య బృందం సమన్వయంతో ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను పూర్తి చేసింది. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. క్లిష్టమైన సమయంలో సమర్థవంతంగా చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని రోగి కుటుంబ సభ్యులు అభినందించారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్యులతో ప్రజలకు ఎల్లప్పుడూ నాణ్యమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది.



## బహుజన ఆత్మగౌరవ దివిటీ చాకలి ఐలమ్మ

- గుండంరాజుపల్లిలో ఘనంగా 41వ వర్ధంతి
- ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన సర్పంచ్, రజక సంఘం నేతలు

**తొలివెలుగు, చిన్నగూడూరు :** తెలంగాణ హక్కుల సాధన కోసం, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని గుండంరాజుపల్లి గ్రామ సర్పంచ్ గునిగంటి కమలాకర్ అన్నారు. చిన్నగూడూరు మండలంలోని గుండంరాజుపల్లి గ్రామంలో గురువారం రజక సంఘం, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ కమలాకర్ మాట్లాడుతూ.. బహుజన మహిళల ఆత్మగౌరవం, హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అన్యాయాన్ని, అణచివేతను ఎదిరించి హక్కుల కోసం పోరాడిన ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో రజక సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, మధు, వెంకటేశ్వర్లు, వెంకన్న, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట తెగువ ఆదర్శనీయం

- ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి
- సీపీఎం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నివాళులు



**తొలివెలుగు, చిట్యాల :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ చూపిన తెగువ, పోరాట స్ఫూర్తి నేటి మహిళలకు ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ అన్నారు. చిట్యాలతో పాటు మండలంలోని ఉరుమడ్ల, నేరడ, వెలిమినేడు గ్రామాల్లో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిట్ట నగేష్ మాట్లాడుతూ.. సమాజంలో నెలకొన్న అన్యాయాలు, అణచివేతలకు వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా పోరాడారని కొనియాడారు. హక్కుల సాధన కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఐలమ్మ పోరాట పటిమ, ధైర్యసాహసాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రుద్రారపు పెద్దులు, హైదరాదు నరసింహ, చెరుకు సైదులు, బెలిజి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజాపేట ఎంఈఓగా మనోజ్ కుమార్

- బాధ్యతలు స్వీకరించిన నూతన మండల విద్యాధికారి
- ఘనంగా సత్కరించిన ఉపాధ్యాయులు, సంఘాల నేతలు

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల విద్యాధికారి (ఎంఈఓ)గా రఘునాథపురం ఎస్ఎస్ఎన్ఎం ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కూచన మనోజ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంఈఓగా పనిచేసిన చందా రమేశ్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో మనోజ్ కుమార్‌ను నియమిస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు నూతన ఎంఈఓ మనోజ్ కుమార్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. నమిల ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు నమిల భరత్ కుమార్ గౌడ్ పాడిన పాట కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఎంఈఓ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా లక్ష్యాల సాధనతో పాటు మండలంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సమష్టిగా పనిచేయాలని కోరారు. జిల్లాలోనే రాజాపేట మండలాన్ని విద్యా రంగంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది: భట్టి విక్రమార్క



తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## భారత్‌లో అడుగుపెట్టిన రష్యా అధ్యక్షుడు పుతిన్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు విచ్చేశారు. న్యూఢిల్లీలో జరగనున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన శుక్రవారం దేశ రాజధానికి చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో పుతిన్‌కు కేంద్ర సహాయ మంత్రి కేవీ సింగ్ స్వాగతం పలికారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ 'ఎక్స్' ద్వారా తెలిపారు. భారత్-రష్యా మధ్య ప్రత్యేక, విశేషాధికార వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని, ఈ బంధం ఎంతో పటిష్టమైనదని ఆయన పోస్టులో పేర్కొన్నారు. ఇటీవల బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సులోనూ మోదీ, పుతిన్ సమావేశమయ్యారు. ఐదేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై ఆ సందర్భంగా మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి ముగింపు దిశగా మనం అడుగులు వేయాలి" అని పుతిన్‌కు మోదీ సూచించారు. నేడు జరగనున్న ఈ భేటీలో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని, వ్యూహాత్మక అంశాలను ఇరువురు నేతలు సమీక్షించుకోనున్నారు. ఉక్రెయిన్ యుద్ధంలోని తాజా పరిస్థితులను మోదీకి వివరిస్తామని రష్యా ఇప్పటికే స్పష్టం చేసింది. రక్షణ రంగ సహకారం కూడా వీరి చర్చల్లో కీలక అంశంగా ఉండే అవకాశం ఉంది. బ్రిక్స్ కూటమికి 2026 సంవత్సరానికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. ఈ క్రమంలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సును నిర్వహిస్తోంది. ఈ సదస్సులో సభ్య, భాగస్వామ్య దేశాల నేతలు పాల్గొని అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై చర్చించనున్నారు.



## సోషల్ మీడియాలో 80ల ట్రెండ్.. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఏఐ ఫోటోల వార్




సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతున్న '1980ల ఏఐ ఫొటో ట్రెండ్' భారతీయ జనతా పార్టీ (బీజేపీ), కాంగ్రెస్ మధ్య తీవ్రస్థాయి మీమ్ యుద్ధానికి దారితీసింది. ఈ వివాదంలోకి కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీని లాగడంతో రాజకీయ దుమారం రేగింది. ఈ వివాదం కాంగ్రెస్ కేరళ యూనిట్ షేర్ చేసిన ఒక ఏఐ-జనరేటెడ్ చిత్రంతో మొదలైంది. 1980ల నాటి గుజరాత్ వీధి అంటూ క్యాప్షన్ జోడించి, మారుతి సుజుకి ఓమ్ని వ్యాన్ ముందు సీట్లో ఒక వ్యక్తి కూర్చుని ఉన్న ఫొటోను పోస్ట్ చేసింది. 80లలో భారత మార్కెట్లోకి వచ్చిన ఈ వ్యాన్‌ను బాలీవుడ్ సినిమాల్లో తరచూ కిడ్నాపులకు వాడే వాహనంగా చూపేవారు. ఈ నేపథ్యంలోనే దీన్ని 'కిడ్నాపింగ్ వ్యాన్' మీమ్‌గా అభివర్ణిస్తారు. దీని ద్వారా కాంగ్రెస్ గుజరాత్‌ను రాజకీయంగా లక్ష్యం చేసుకుందని విశ్లేషణలు వెలువడ్డాయి. కాంగ్రెస్ పోస్టుకు బీజేపీ తీవ్రంగా బదులిచ్చింది. బీజేపీ తెలంగాణ యూనిట్ ఒక మహిళ బార్ టేబుల్‌పై డ్యాన్స్ చేస్తున్న ఏఐ చిత్రాన్ని పోస్ట్ చేసి, 'లుసియానా, ఇటలీ. సిర్కా-1970ం' అని క్యాప్షన్ ఇచ్చింది. ఇది సోనియా గాంధీ జన్మస్థలం కావడంతో ఆమెను ఉద్దేశించే ఈ పోస్ట్ పెట్టారని స్పష్టమైంది. బీజేపీ గుజరాత్ యూనిట్ మరో అడుగు ముందుకేసి, ఓ సీనియర్ కాంగ్రెస్ నేత పొట్టి దుస్తుల్లో, చేతిలో మద్యం గ్లాస్‌తో విదేశీయుల మధ్య ఉన్నట్టుగా చిత్రాన్ని పోస్ట్ చేసింది. అయితే, తీవ్ర విమర్శలు రావడంతో ఆ చిత్రాన్ని తర్వాత తొలగించింది. బీజేపీ కేరళ యూనిట్ కూడా ఇదే తరహా చిత్రాలను షేర్ చేసింది. వాస్తవానికి ఈ ట్రెండ్ తొలుత సాధారణ సోషల్ మీడియా ఫ్యాషన్‌గా మొదలైంది. ఏఐ టూల్స్ ఉపయోగించి గతకాలపు ఫోటోలను రూపొందించడంపై చాలామంది ఆసక్తి చూపారు. ప్రధాని నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ సహా పలువురు నేతల ఏఐ చిత్రాలు కూడా వైరల్ అయ్యాయి. శశి థరూర్ వంటి కొందరు నేతలు తమ అసలైన 80ల నాటి ఫోటోలను షేర్ చేసి ఈ ట్రెండ్‌లో పాల్గొన్నారు. అయితే, రాజకీయ పార్టీలు దీన్ని పరస్పర విమర్శలకు వాడుకోవడంతో, ఈ మీమ్ వార్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది.



## బీఎల్ఓల సేవలు అభినందనీయం

- వంద శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసినందుకు గౌరవం
- వలిగొండ తహసిల్దార్ దశరథ

**తొలివెలుగు, వలిగొండ :** మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో సమగ్ర ఓటర్ నమూనా (ఎస్ఐఆర్) ప్రక్రియను వంద శాతం విజయవంతంగా పూర్తి చేసిన బూత్ లెవల్ అధికారులను (బీఎల్ఓ) ఘనంగా సన్మానించినట్లు తహసిల్దార్ దశరథ తెలిపారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని పూర్తి చేసిన బీఎల్ఓలు పల్లెర్ల సతీష్, బంధారపు మంగమ్మ, బందారపు మహేశ్వరి, ఫైళ్ళ పుణ్యవతిలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల నమోదు ప్రక్రియను అధికారుల సమన్వయంతో పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఓటరు జాబితా సవరణలో ప్రతి అర్హుడినీ నమోదు చేయడంలో సహకరించిన గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సైదులు, జీపీఓ అనిత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్య భద్రతకు 'డివిస్' బాసట

- 240 మంది విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు
- రూ.1.38 లక్షల విలువైన 3,304 నోట్‌బుక్స్ పంపిణీ
- ఉచితంగా మందులు అందించిన డివిస్ లాబొరేటరీస్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు విద్యాభివృద్ధికి డివిస్ లాబొరేటరీస్ అండగా నిలుస్తోంది. మండల పరిధిలోని స్వామివారి లింగోటం గ్రామంలో గురువారం డివిస్ లాబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో సుమారు 240 మంది విద్యార్థులకు వైద్యులు డాక్టర్ జయంత్‌కుమార్, డాక్టర్ నరేష్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం సర్పంచ్ భీమిడి ప్రదీప్‌జీ చేతుల మీదుగా విద్యార్థులకు రూ. 1,38,676 విలువైన 3,304 నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై డివిస్ లాబొరేటరీస్ యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం, నోట్‌బుక్స్ అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు సంస్థ అందిస్తున్న సహకారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు నోముల పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల అవసరాలను గుర్తించి వైద్య శిబిరం, నోట్‌బుక్స్ పంపిణీకి సహకరించిన డివిస్ లాబొరేటరీస్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉప్పు వీరేశం, భాతరాజు లింగస్వామి, చెన్నగోని సుశీల వెంకటేష్, తూర్పింటి సుజాత యాదయ్య, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, డివిస్ ప్రతినిధులు బి.గోపి, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





# మాజీ ఎమ్మెల్యే కొట్టారు కుటుంబానికి రుణపడి ఉంటా

**ఎంపీపీ పెనుమత్స శ్రీనివాసరాజు**

**ఏలూరు :** దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొట్టారు అబ్బయ్య చౌదరి ఏపీ ఆయిల్ ఫుడ్ మాజీ చైర్మన్ కొటారు రామచంద్రరావు వైఎస్ఆర్సిపి పార్టీకి రుణపడి ఉంటానని ఏలూరు ఎంపీపీ పెనుమత్స శ్రీనివాసరాజు అన్నారు. ఏలూరు రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యాలయ సిబ్బంది మాజీ సర్పంచులు ఐదేళ్ల ఎంపీపీ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసరాజు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ఏలూరు లో ఏలూరు మండలానికి ఎంపీపీ పదవి ఇచ్చి కొల్లేరు అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించేలా ప్రోత్సహించిన కొటారు కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటాను అన్నారు తనకు విధి నిర్వహణలో ఎంపీటీసీలు సర్పంచులు వార్డ్ మెంబర్లు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అన్ని శాఖల అధికారులు ఉద్యోగులు అందించిన సహకారాన్ని ఎన్నటికీ మరువలేనన్నారు. వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షులు తెర ఆనంద్ పార్టీ నాయకులు వర్రె నారాయణరావు కే ప్రభుదేవాపరశురాం ప్రకాష్ సత్కరించారు.

# సినిమా టికెట్ ధర పెంచే ప్రభుత్వం రైతు పంట ధర ఎందుకు పెంచదు

**వైఎస్ఆర్సిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి డిఎన్వి ప్రసాద్**

**ఏలూరు :** సినిమా టికెట్ ధరపెంచే ప్రభుత్వం రైతు పంట ధర ఎందుకు పెంచదని వైఎస్ఆర్సిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి డిఎన్వి ప్రసాద్ ప్రశ్నించారు గురువారం పోతునూరు లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూరగాయలు వంట నూనెలు నిత్యవసర వస్తువులు ధరలు సామాన్యులకు అందని అంత ఎత్తులో ఉన్న సంగతి ప్రభుత్వానికి తెలియదన్నారు. అధికధరలు కట్టడి చేయకపోగా పర్యవేక్షణ కూడా చేయకపోవడం పేద బడుగు బలహీన ముస్లిం మైనారిటీ వర్గాలను నిర్లక్ష్యం చేయడమేనని విమర్శించారు. సినిమా హై బడ్జెట్ అంటారు టిక్కెట్ ధర పెంచుతారు రైతు పెట్టుబడి పెరిగింది వరి పంట ధర ఎందుకు పెరగదు సినిమా టికెట్కు విలువ ఉంది రైతు చెమటకు విలువ లేదా సినిమాకు ఒక న్యాయం రైతుకు మరొక న్యాయమాన్ని అన్నారు. ఆరుగాలం శ్రమించి అప్పులు తెచ్చి పంటలపై పెట్టుబడి పెట్టి కుటుంబం అంతా శ్రమిస్తుంటే పండిన పంటకు రైతుకు గిట్టుబాటు ధర తీసుకునే స్వేచ్ఛ లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులు కౌలు రైతులు వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు జీవన విధానం భవిష్యత్తు భద్రత కల్పించే విధంగా సినిమాలకు మాదిరిగానే రైతు పంటకు గిట్టుబాటు ధర ప్రభుత్వం పెంచాలని రైతులందరినీ ఆదుకోవాలని రాష్ట్ర కార్యదర్శి డిఎన్వి ప్రసాద్ డిమాండ్



# రోడ్డు ప్రమాద క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ.....

**మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం.. మృతురాలి కుటుంబానికి పరామర్శ**



**సెప్టెంబర్ 10:** తణుకు మండలం తేతలి హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పరామర్శించారు. ప్రమాదంలో గాయపడి తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని స్వయంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలపై ఆసుపత్రి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే, మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం తరఫున అందాల్సిన సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, క్షతగాత్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సహాయం అందించాలని స్పష్టం చేశారు. ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని రాధాకృష్ణ తెలిపారు.

# కాంట్రాక్టు కార్మికుల పేరిట దశాబ్దాలుగా వెట్టిచాకిరి

**-రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి: గెడ్డం రవీంద్రబాబు**



**పెదవేగి:** దేశంలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా కమిటీ సభ్యులు గెడ్డం రవీంద్రబాబు పిలుపునిచ్చారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగ నియామకాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు కూడా సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు. కొంతమంది ఉద్యోగులను అటు కాంట్రాక్టు, ఇటు ఔట్సోర్సింగ్ పరిధిలో కాకుండా పార్ట్టైమ్ విధానంలో నియమిస్తూ కార్మికులను దశాబ్దాలుగా వెట్టిచాకిరికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 12, 2026న ఏలూరులో ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ ఎన్జీవో నాయకుడు ఆర్.ఎస్. హరనాథ్, ఐఎఫ్టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు పి. ప్రసాద్, కర్ణాటక హైకోర్టు న్యాయవాది, ఐఎఫ్టీయూ జాతీయ కమిటీ సభ్యుడు బాలన్ తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, ఇతర హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణలో భాగస్వాములు కావడానికి కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని గెడ్డం రవీంద్రబాబు కోరారు. ఈ కార్యక్రమంలో కాకి రాజారావు, కాకి పార్వతి, రంగా, రాజు, కట్ట శ్రీను, రాజేష్, సతీష్ పాల్గొన్నారు.

# ప్రజా సేవకులుగా పనిచేద్దాం.. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములవుదాం

**భీమవరం, సెప్టెంబర్ 10:** ప్రజల కోసం అంకితభావంతో, ఎలాంటి ఈగోలకు తావులేకుండా పనిచేసి నిజమైన ప్రజా సేవకులుగా నిలవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేస్తూనే, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అమరావతి నుంచి నిర్వహించిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోపన్యాసం చేశారు. గత 7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, నిర్దేశించిన లక్ష్యాలపై సమీక్ష నిర్వహించి, మరింత వేగంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈసారి కలెక్టర్ల సదస్సులో నాయకత్వ అంశంపై ప్రత్యేకంగా చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా గత 27 నెలల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టామని సీఎం పేర్కొన్నారు. రూ.1.40 లక్షల కోట్లను సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లను అభివృద్ధికి ఖర్చు చేసినట్లు వివరించారు. ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం 'రాయలసీమ రైజింగ్', 'కోస్తాంధ్ర భవిష్యత్‌కు కొత్త పుంతలు', 'ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు' వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. హంద్రీనీవా, వెలిగొండ మొదటి దశ, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులను పూర్తి చేశామని సీఎం తెలిపారు. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేసి రాజధానిని గుంటూరు, విజయవాడ నగరాలతో అనుసంధానం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, భౌగోళిక అసమానతల కారణంగా నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలకు సమర్థవంతంగా నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గోదావరి, కావేరి, మహానది, గంగా నదులను అనుసంధానం చేసి వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేయగలిగితే దేశ అభివృద్ధి మరింత




వేగవంతమవుతుందని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. నీటి సంరక్షణ, భద్రత కోసం చేస్తున్న కృషిని గుర్తించి తనను 'వాటర్‌మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి 36 ప్రాజెక్టులను చేపట్టేందుకు క్యాలెండర్ రూపొందించామని, నిర్దేశించిన గడువులోగా వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీఎం స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు అధికారులు అందించిన తోడ్పాటుతో రాష్ట్రంలో పలు విజయాలను సాధించగలిగామని చంద్రబాబు తెలిపారు. ఇప్పటివరకు సాధించిన విజయాలు ఒక్కరి వల్ల సాధ్యమైనవి కావని, మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమష్టి కృషి ఫలితమేనని పేర్కొన్నారు. ఇది ఎవరి వ్యక్తిగత విజయం కాదు.. టీమ్ సక్సెస్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

**వీడియో కాన్ఫరెన్స్‌లో పశ్చిమగోదావరి జిల్లా అధికారులు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి నిర్వహించిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సుకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్. అప్పారావు, జిల్లా సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి. మోహన్ రాజు, పీజీఆర్ఎస్ ప్రత్యేక అధికారి వై. దోసిరెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి బి. పిచ్చియ్య, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి. శ్రీలక్ష్మి, సీపీఓ కె. శివపార్వతి, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి ఎ. వెంకటలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి. అరుణకుమారి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఏ.వి. సూరిబాబు, జిల్లా హ్యాండ్‌లూమ్ అధికారి అప్పారావు, పరిశ్రమల శాఖ అధికారి యు. మంగపతి, జిల్లా సహకార శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా టూరిజం శాఖ అధికారి ఏ. వెంకట అప్పారావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 12న ఆర్టీఐ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలి

**జై ఆంధ్ర (జై భారత్) అసోసియేషన్ ఏపీ, తెలంగాణ జిల్లా అధ్యక్షులకు పిలుపు**

**విజయవాడ,** జై ఆంధ్ర (జై భారత్) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల అధ్యక్షులు అక్టోబర్ 12న సమాచార హక్కు చట్టం--2005 దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని హైకోర్టు న్యాయవాది, జై ఆంధ్ర (జై భారత్) జాతీయ లీగల్ అడ్వైజర్ కొప్పర్తి గుణలక్ష్మి పిలుపునిచ్చారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన హక్కులు, దాని ద్వారా ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీఐ చట్టం ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేలా జిల్లాల వారీగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు సుమిత్రానందన్ సంస్థలోని యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తున్నారని గుణలక్ష్మి తెలిపారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం అవసరమైన సహకారం అందించేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లవి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి సమావేశానికి సంబంధించిన వివరాలను ఈ నెల 13న మీడియా ద్వారా వెల్లడించనున్నట్లు ఆమె తెలిపారు. జై ఆంధ్ర (జై భారత్) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీఐ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధ్యక్షులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని గుణలక్ష్మి కోరారు.



# అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని రిమాండ్ చేయాలి.

**రిమాండ్ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం: మాల మహానాడు**

**రావులపాలెం,** డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గుడాల విశ్వనాథ్‌ను వెంటనే రిమాండ్ చేయాలని మాల మహానాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యూత్ అధ్యక్షులు గెడ్డం రమేష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పెనుగొండ మండలం ముల్లపర్రు గ్రామానికి చెందిన గుడాల విశ్వనాథ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపిస్తూ కాకర అనసూయ అనే యువతి మాల మహానాడు నాయకుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ స్పందించి, యువతితో పోలీసులకు ఫిర్యాదు చేయించాలని సూచించినట్లు పేర్కొన్నారు. దీంతో కోనసీమ జిల్లా యూత్ అధ్యక్షులు గెడ్డం రమేష్, పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు సరెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువతిని రావులపాలెం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి టౌన్ సీఐ జి. రమేష్‌కు ఫిర్యాదు చేయించినట్లు తెలిపారు. ఈ మేరకు రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వెల్లడించారు. అంబేద్కర్ వంటి మహనీయుడిపై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని గెడ్డం రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మర్రె సామ్యూల్, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి నల్లి సంజీవరావు, రావులపాలెం ఆర్టీసీ డిపో యూనియన్ నాయకులు కండెలి రాజు, బద్దె యోసోబు, దళిత నాయకులు కేశరపల్లి రమేష్, సాక సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శులు పెనుమాల బోసు, సందీప్, పిపర్తి రెడ్డి, నేరుమిల్లి భాస్కరరావు, తాడి నాగరాజు, గోసంగి రాజు తదితరులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్‌లో భారీ మార్పులు.. రంగంలోకి రాహుల్ గాంధీ

**2029 లక్ష్యంగా కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పులు**
**జాతీయ కార్యదర్శుల ఎంపికకు ఇంటర్వ్యూలు చేస్తున్న రాహుల్ గాంధీ**
**ప్రస్తుత కార్యదర్శుల్లో 60 శాతం మందిపై వేటుకు అవకాశం**
**ప్రియాంకకు ఎన్నికల కమిటీ బాధ్యతలు**
**ఖర్గే తర్వాత కేసీకి అధ్యక్ష పదవిపై ఊహాగానాలు**
**తెలంగాణ ఇన్‌చార్జి మార్పుపైనా జోరుగా చర్చ**

2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పులకు అగ్ర నాయకత్వం శ్రీకారం చుట్టింది. ఏఐసీసీ జాతీయ కార్యదర్శుల నియామకాల కోసం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ప్రియాంకా గాంధీ వాద్రాతో కలిసి ఆయన ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో సోమవారం నుంచి ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. దాదాపు 120 మంది నేతలను ఇందుకు ఎంపిక చేశారు. గ్రూపులుగా విభజించి ఒకేసారి 10 మందిని రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ చేస్తున్నారు. అభ్యర్థుల ప్రొఫైల్, గతంలో చేసిన పనులు, రాజకీయ దృక్పథంపై రాహుల్ ప్రశ్నలు అడుగుతుండగా, ప్రియాంకా గాంధీ మరిన్ని వివరాలు రాబడుతున్నారు. ఈ నియామకాల్లో యువతకు, 'సంగఠన్ సృజన్' కార్యక్రమంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత జాతీయ కార్యదర్శుల్లో 60 శాతానికి పైగా మార్పులు తప్పవని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు, పార్టీలో మరిన్ని కీలక మార్పులు జరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. త్వరలో ఎన్నికల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, దానికి ప్రియాంకా గాంధీని చైర్‌పర్సన్‌గా నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అలాగే, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పదవీ విరమణ చేయవచ్చని, ఆయన స్థానంలో కేసీ వేణుగోపాల్‌ను నియమించవచ్చని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే, అక్టోబర్ చివరి నాటికి జిల్లా అధ్యక్షుల నియామకాలు పూర్తి చేస్తామని కేసీ వేణుగోపాల్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ మార్పుల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మార్పుపైనా చర్చ జరుగుతోంది. ప్రస్తుత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్నారని, దీంతో ఆమె స్థానంలో కొత్తవారిని నియమించవచ్చని కొందరు నేతలు చెబుతున్నారు. అయితే, ప్రస్తుతం ఆమె తన బాధ్యతల్లోనే కొనసాగుతున్నారు. రాష్ట్రంలో పార్టీ సమన్వయం, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి అంశాలపై దృష్టి సారించారు. మొత్తంగా ఈ మార్పుల ద్వారా 2029 నాటికి పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా అధిష్ఠానం అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# ఉద్యోగం పోతే వెంటనే వెనక్కి.. భారతీయ టెకీలను టార్గెట్ చేసిన కొత్త రూల్?

**ఉద్యోగం కోల్పోయిన హెచ్-1బీ వీసాదారులకు 60 రోజుల గ్రేస్ పీరియడ్ రద్దుకు ప్రతిపాదన**
**కొత్త నిబంధన అమలైతే ఉద్యోగం పోయిన వెంటనే దేశం విడిచి వెళ్లాల్సిందే**
**ఈ నిర్ణయం వల్ల అత్యధికంగా నష్టపోయేది భారతీయ టెకీలే**
**ప్రస్తుతానికి ఇది కేవలం ప్రతిపాదన మాత్రమే**
**60 రోజుల ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే తుది నిర్ణయం**

అమెరికాలో హెచ్-1బీ వంటి తాత్కాలిక వీసాలపై పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు ట్రంప్ సర్కార్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి లేదా దేశం విడిచి వెళ్లేందుకు సన్నద్ధమవడానికి ప్రస్తుతం ఇస్తున్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను రద్దు చేయాలని ప్రతిపాదించింది. ఇది అమల్లోకి వస్తే, ఉద్యోగం పోయిన మరుసటి రోజే దేశం విడిచి వెళ్లాల్సి వస్తుంది. హెచ్-1బీ వీసాదారుల్లో అధిక శాతం భారతీయ టెకీలే కావడంతో ఈ ప్రతిపాదన వారిలో ఆందోళన రేపుతోంది. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్‌ఎస్) ఈ మేరకు ఫెడరల్ రిజిస్టర్‌లో గురువారం ఒక ప్రకటన చేసింది. ఈ ప్రతిపాదన శుక్రవారం అధికారికంగా ప్రచురితమై, 60 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నిబంధన ప్రకారం, ఉద్యోగం కోల్పోయిన హెచ్-1బీ, ఎల్-1, ఓ-1, ఈ-1 వంటి వీసాదారులు 60 రోజుల్లోపు మరో స్పాన్సర్‌ను వెతుక్కోవచ్చు లేదా తమ వ్యవహారాలు చక్కబెట్టుకోవచ్చు. ఒబామా హయాంలో 2017లో ఈ వెసులుబాటును కల్పించారు. అయితే, ఈ గ్రేస్ పీరియడ్ వల్ల పరిపాలనా భారం పెరుగుతోందని, వీసా స్టేటస్‌ను నేరుగా ఉద్యోగంతో ముడిపెట్టడం ద్వారా అమెరికన్లకు అవకాశాలు పెరుగుతాయని డీహెచ్‌ఎస్ తన ప్రతిపాదనలో పేర్కొంది. ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన తర్వాతే దీనిపై తుది నిర్ణయం వెలువడుతుంది. అప్పటివరకు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్ నిబంధనే అమల్లో ఉంటుంది.




# న్యాయం కోసం రాజ్‌భవన్‌ను ఆశ్రయించిన జోగి మేఘన.....

**కేసు ఉపసంహరించుకోవాలని బెదిరింపులు..**
**తల్లిదండ్రులకూ హాని చేస్తామని హెచ్చరికలు**



**విజయవాడ:** తనకు న్యాయం చేయడంతో పాటు రక్షణ కల్పించాలని కోరుతూ మాజీ మంత్రి జోగి రమేష్ కోడలు జోగి మేఘన రాష్ట్ర గవర్నర్‌ను ఆశ్రయించారు. తనపై జరిగినట్లు పేర్కొన్న వేధింపులు, దాడులు, బెదిరింపులపై ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై ఉన్నప్పటికీ బెదిరింపులు కొనసాగుతున్నాయని ఆమె గవర్నర్‌కు సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మేఘన ఫిర్యాదు ప్రకారం.. వివాహ సమయంలో భారీగా ఖర్చు చేసినప్పటికీ, పెళ్లి అనంతరం అదనపు కట్నం కోసం వేధింపులు ప్రారంభమయ్యాయని ఆరోపించారు. రూ.5 కోట్ల కట్నంతో పాటు ఫార్చ్యూనర్ కారు, వజ్రాల హారాలు తదితరాలను డిమాండ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

**ప్రాణహాని కలిగించే ప్రయత్నాలు చేశారంటూ ఆరోపణలు**

తనను గోవా సమీపంలో నీటిలోకి తోసేందుకు ప్రయత్నించారని, ఈత రాని తనను పడవ నుంచి బయటకు నెట్టే ప్రయత్నం జరిగిందని మేఘన ఆరోపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఘట్‌కేసర్‌లోని ఓ నిర్మానుష్య ప్రదేశంలో దిండుతో ముఖాన్ని అదిమి ఊపిరాడకుండా చేసి హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఇంటిపై కూడా తనను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించారని, "ఇది కేవలం ట్రయల్ మాత్రమే" అంటూ బెదిరించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. తనను మూడో అంతస్తులో నిర్బంధించి, సరైన ఆహారం కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని, తన కదలికలపై డ్రోన్ల ద్వారా నిఘా పెట్టినట్లు కూడా ఆరోపించారు.

**మతం మారాలని ఒత్తిడి తెచ్చారంటూ ఫిర్యాదు**

తన విశ్వాసాలకు విరుద్ధంగా మతం మారాలని ఒత్తిడి తీసుకొచ్చారని మేఘన ఆరోపించారు. పూజలు చేసుకోవడానికి కూడా అనుమతించలేదని, ఈ విషయాన్ని ప్రశ్నించినందుకు తనపై మరింత వేధింపులు, దాడులకు పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

**ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు**

ఈ వ్యవహారంపై ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 326/2026 నమోదైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), కట్న నిరోధక చట్టంలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదైనప్పటికీ, తనకు బెదిరింపులు కొనసాగుతున్నాయని మేఘన ఆరోపించారు. కేసును ఉపసంహరించుకోవాలని, లేకపోతే తనతో పాటు కన్నవారికి కూడా హాని చేస్తామని బెదిరింపులు వస్తున్నాయని ఆమె గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తనకు, తన కుటుంబ సభ్యులకు తక్షణ రక్షణ కల్పించి, వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి న్యాయం చేయాలని ఆమె కోరినట్లు తెలుస్తోంది. తనకు ఎదురైనట్లు చెబుతున్న వేధింపులు, బెదిరింపులపై మేఘన చేసిన ఆరోపణలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై పోలీసులు చేపట్టే దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# మీరు ఇచ్చిన వివరాలను పత్రికా కథనం తరహాలో, ఆసక్తికరమైన హెడ్డింగ్‌తో ఇలా రూపొందించాను

**25 నిమిషాల ప్రకటనలపై కోర్టుకెక్కిన యువ న్యాయవాది**
**మూడు సినిమా టికెట్లతో మొదలైన పోరాటం.. పీవీఆర్ ఐనాక్స్‌కు భారీ జరిమానా**



**బెంగళూరు:** సినిమా చూడటానికి థియేటర్‌కు వెళ్లిన ఓ యువ న్యాయవాది.. సినిమా ప్రారంభానికి ముందు ఏకంగా 25 నిమిషాల పాటు వాణిజ్య ప్రకటనలు ప్రదర్శించడాన్ని ప్రశ్నిస్తూ కోర్టును ఆశ్రయించారు. వినియోగదారుల సమయం కూడా విలువైనదేనని చాటి చెప్పిన ఈ కేసులో పీవీఆర్ ఐనాక్స్‌కు వినియోగదారుల కమిషన్ షాక్ ఇచ్చింది. బెంగళూరుకు చెందిన 31 ఏళ్ల న్యాయవాది ఎం.ఆర్. అభిషేక్ 2023 డిసెంబర్ 26న 'సామ్ బహదూర్' సినిమా చూసేందుకు పీవీఆర్ ఐనాక్స్‌లో మూడు టికెట్లు కొనుగోలు చేశారు. టికెట్‌పై సినిమా ప్రారంభమయ్యే సమయం స్పష్టంగా ఉన్నప్పటికీ.. ఆ సమయానికి సినిమా ప్రారంభం కాలేదు. ముందుగా దాదాపు 25 నిమిషాల పాటు వాణిజ్య ప్రకటనలు ప్రదర్శించారు. దీంతో సినిమా నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా ముగిసింది. సినిమా అనంతరం అభిషేక్‌కు ముందుగానే షెడ్యూల్ చేసిన పని సంబంధిత ఫోన్ కాల్స్ ఉండటంతో.. సినిమా ఆలస్యం కారణంగా వాటిని రద్దు చేసుకోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

**వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించిన అభిషేక్**

తాను చెల్లించిన మొత్తానికి నిర్దిష్ట సమయంలో ప్రారంభమయ్యే సేవను అందించాల్సి ఉండగా.. తన అనుమతి లేకుండా విలువైన సమయాన్ని ప్రకటనల కోసం వినియోగించారని అభిషేక్ వాదించారు. దీంతో బెంగళూరు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసులో పీవీఆర్ ఐనాక్స్ సంస్థ తన వాదనను వినిపిస్తూ.. సినిమా ప్రారంభానికి ముందు ప్రజా ప్రయోజన ప్రకటనలను ప్రదర్శించడం చట్టపరంగా అవసరమని, అందువల్ల కొంత ఆలస్యం తప్పదని పేర్కొంది.

**10 నిమిషాల వరకు ఓకే.. 25 నిమిషాలు కాదు**

సంస్థ వాదనను కమిషన్ పూర్తిగా అంగీకరించలేదు. సినిమా ప్రారంభానికి ముందు కొంత సమయం ప్రజా ప్రయోజన ప్రకటనలకు కేటాయించాల్సి ఉండవచ్చని పేర్కొన్నప్పటికీ.. ఆ నిబంధనను 25 నిమిషాల పాటు వాణిజ్య ప్రకటనలు ప్రదర్శించడానికి ఉపయోగించలేమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభిషేక్‌కు రూ.20,000 నష్టపరిహారం, కేసు ఖర్చుల కింద రూ.8,000 చెల్లించాలని పీవీఆర్ ఐనాక్స్‌ను కమిషన్ ఆదేశించింది. అంతేకాకుండా కన్స్యూమర్ వెల్ఫేర్ ఫండ్‌కు రూ.1 లక్ష చెల్లించాలని కూడా ఆదేశించినట్లు సమాచారం.

**'సమయమే డబ్బు'.. కమిషన్ కీలక వ్యాఖ్యలు**

ఈ తీర్పులో వినియోగదారుల సమయానికి ఉన్న విలువపై కమిషన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 'ఈ ఆధునిక యుగంలో సమయమే డబ్బు' అని పేర్కొన్న కమిషన్.. ప్రతి వ్యక్తి సమయం ఎంతో విలువైనదని స్పష్టం చేసింది. అవసరం లేని ప్రకటనలను చూస్తూ థియేటర్‌లో 25 నుంచి 30 నిమిషాల పాటు కూర్చోవాల్సి రావడం అధిక సమయమని పేర్కొంది. ప్రజలకు ఉద్యోగ, వ్యాపార, వృత్తిపరమైన షెడ్యూల్స్ ఉంటాయని.. సినిమా ఆలస్యం వల్ల వారి ఇతర కార్యక్రమాలపై ప్రభావం పడే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది.

**మూడు టికెట్లతో మొదలైన ప్రశ్న**

పీవీఆర్ ఐనాక్స్ వంటి భారీ సినిమా ప్రదర్శన సంస్థకు వ్యతిరేకంగా మూడు టికెట్ల ఆధారంగా అభిషేక్ చేసిన పోరాటం వినియోగదారుల హక్కులపై చర్చకు దారితీసింది. సాధారణంగా థియేటర్లలో ప్రకటనలు ప్రదర్శించడం అలవాటుగా మారిపోయినప్పటికీ.. వినియోగదారుడి సమయానికి కూడా విలువ ఉందని ఈ కేసు మరోసారి గుర్తు చేసింది. తనకు ఎదురైన అనుభవాన్ని ప్రశ్నిస్తూ అభిషేక్ చేసిన న్యాయపోరాటం.. సేవలకు డబ్బు చెల్లించే ప్రతి వినియోగదారుడికీ తన హక్కులపై అవగాహన కల్పించే అంశంగా నిలిచింది.

# స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి..

**ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి: వడ్డీ రఘురామ్ నాయుడు**




**పెంటపాడు,** తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వడ్డీ రఘురామ్ నాయుడు పిలుపునిచ్చారు. పెంటపాడు మండలం పడమర విప్పర్రు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రఘురామ్ నాయుడు అధ్యక్షత వహించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, నాయకులు--కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని రఘురామ్ నాయుడు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, పట్టణ, మండల నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.




## కేబుల్ వ్యాపారంలోకి ఆదిత్యా బిర్లా

ముంబై, సెప్టెంబర్ 3 : పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న ఆదిత్యా బిర్లా గ్రూపు తాజాగా వైర్లు, కేబుల్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఈ విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి రూ.1,800 కోట్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్టు గ్రూపు చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. అల్ట్రాటెక్ సిమెంట్ విభాగంలో పనిచేయనున్న ఈ కేబుల్స్ అల్ట్రావోల్ట్ పేరుతో విడుదల చేసినట్టు ఆయన చెప్పారు. గత నాలుగేండ్లలో మూడో అతిపెద్ద వ్యాపారం ఇదే కావడం విశేషం.

## మహీంద్రా బ్లేజో ట్రక్కులు



హైదరాబాద్, సెప్టెంబర్ 3 : ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా.. దేశీయ మార్కెట్లోకి బ్లేజో ఐ-టీఆర్‌కే ట్రక్కులను తీసుకొచ్చింది. అధిక మైలేజీ ఇచ్చే ఈ ట్రక్కులతో కొనుగోలు చేసిన నాటి నుంచి ఐదేండ్లలో రూ.15 లక్షల వరకు ఆదాకానున్నదని కంపెనీ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వినోద్ సహవే తెలిపారు. ఆటోమె-ుబైల్ నివేదికలను విశ్లేషించండి 7.2 లీటర్ల ఇంజిన్‌తో తయారైన ఈ 320 హెచ్‌పీ ఎంపవర్ మాడల్ పాత మాడళ్లతో పోలిస్తే అధిక మైలేజీ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది చివరినాటికి ఈ-బస్సును కూడా తీసుకురానున్నట్టు ప్రకటించారు.

## ఆనంద్ మహీంద్రా ఆవిష్కరించిన స్పెషల్ బైక్

క్లాసిక్ లెజెండ్స్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న.. జావా యెజ్డీ మోటార్‌సైకిల్స్, ఇటీవల లాంచ్ చేసిన జావా 42 ఎఫ్‌జె ఆల్ స్టార్స్ తర్వాత తమ కొత్త శ్రేణిని విస్తరిస్తూ.. 'జావా ఆల్ స్టార్స్ 42 బాబర్'ను ఆవిష్కరించింది. మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, గ్లోబల్ చెస్ లీగ్ 2026లో ఈ బైకును ఆవిష్కరించారు. దీని ధరలు రూ. 2.09 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతాయి. జావా ఆల్ స్టార్స్ 42 బాబర్.. స్టాండర్డ్ జావా 42 బాబర్‌పైనే ఆధారపడి ఉంటుంది. కానీ కొత్త పెయింట్ ఎంపికలు, చదరంగం గళ్ల గ్రాఫిక్స్, ఆల్ స్టార్స్ చిహ్నాన్ని పొందుతుంది. ఇది బ్లాక్ మిర్రర్, షాడో బ్లాక్, సిల్వర్ నైట్, జాస్పర్ రెడ్, మిస్టిక్ కాపర్ అనే ఆరు రంగులలో లభిస్తుంది.

**వేరియంట్ వారీ ధరలు**

**ఆల్ స్టార్స్ మిస్టిక్ కాపర్: రూ. 2,08,942**

**ఆల్ స్టార్స్ జాస్పర్ రెడ్: రూ. 2,15,942**

**ఆల్ స్టార్స్ సిల్వర్ నైట్: రూ. 2,15,942**

**ఆల్ స్టార్స్ షాడో బ్లాక్: రూ. 2,17,942**

**ఆల్ స్టార్స్ బ్లాక్ మిర్రర్: రూ. 2,19,942**

ఈ స్పెషల్ ఎడిషన్.. స్టాండర్డ్ 42 బాబర్‌లోని 334 సీసీ సింగిల్-సిలిండర్, లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తోనే కొనసాగుతుంది. ఇది 7,500 తీజూఎ వద్ద 29 హార్స్ పవర్, 5,500 తీజూఎ వద్ద 30.01 న్యూటన్ మీటర్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి ఆరు-స్పీడ్ గేర్‌బాక్స్ మరియు ఎలక్ట్రానిక్ ఫ్యూయల్ ఇంజెక్షన్ జత చేయబడి ఉంటాయి. ఈ మోటార్‌సైకిల్‌లో డబుల్-క్రాడిల్ ఫ్రేమ్, 35 మిమీ టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్కులు, 7 టైప్స్ ప్రీలోడ్ సర్దుబాటుతో కూడిన గ్యాస్-ఛార్జ్డ్ రియర్ మోనోషాక్‌ను వంటివి ఉన్నాయి. బ్రేకింగ్ కోసం ముందువైపు 280 మిమీ డిస్క్, వెనుకవైపు 240 మిమీ డిస్క్‌తో పాటు డ్యూయల్-ఛానల్ ఏబీఎస్ ఉన్నాయి. ఈ బైక్ ఫ్యూయెల్ ట్యాంక్ కెపాసిటీ 12.5 లీటర్లు.



# ఫోక్స్‌వ్యాగన్‌లో భారీగా ఉద్యోగాల కోత.. లక్ష మందిని తీసేస్తామని ప్రకటన

జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ భారీగా ఉద్యోగ కోతలకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తొలగించేందుకు నిర్ణయించినట్లుగా ప్రకటించింది. ఈ దశాబ్దం చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి కానుందని వెల్లడించారు. ఈ మేరకు కంపెనీ యాజమాన్యం, కార్మిక సంఘాలు ఒక అంగీకారానికి వచ్చాయని పేర్కొంది. ఇందులో ఇప్పటికే 50 వేల ఉద్యోగాల కోతకు అంగీకరించగా.. తాజాగా మరో 50 వేల పోస్టులను తొలగించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పింది. కాగా, కంపెనీ చరిత్రలోనే కాకుండా ప్రపంచ ఆటోమొబైల్ రంగంలోనే ఇది అతిపెద్ద పునర్వ్యవస్థీకరణగా నిలవనుంది. కంపెనీ ఆర్థికపరమైన అంశాలకు తగినట్లుగా ఉద్యోగుల సంఖ్యను క్రమబద్ధీకరించడం తప్పనిసరని ఫోక్స్‌వ్యాగన్ కంపెనీ ఈ సందర్భంగా పేర్కొంది. అమెరికా సుంకాలు, ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్‌లో హెచ్చుతగ్గులు, ముఖ్యంగా చైనాకు చెందిన సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ కారణంగా యూరప్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే లేఆఫ్స్‌కు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఫోక్స్‌వ్యాగన్ కంపెనీలో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోని దాదాపు 43 శాతం మంది విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఆ కంపెనీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తగ్గిస్తామని ప్రకటించింది. అంటే మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 15 శాతానికి సమానం అన్నమాట. ఈ ఉద్యోగాల కోతను కార్మిక సంఘాలు వ్యతిరేకించినట్లుగా గతంలో వార్తలు




వచ్చాయి. అయితే తాజా ప్రకటనలో మాత్రం కార్మిక సంఘాలు కూడా అంగీకరించినట్లు తెలపడం గమనార్హం. కాగా, హ్యానోవర్, ఎమ్డెన్, జ్వికావ్, నెకార్సుల్మ్‌లోని నాలుగు జర్మన్ ప్లాంట్ల దీర్ఘకాలిక భవిష్యత్తుపై స్పష్టత లేదని కంపెనీ తెలిపింది. అయితే ఈ ప్లాంట్లకు ప్రత్యామ్నాయ వినియోగ మార్గాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. పూర్తి స్థాయి ప్లాంట్లను జర్మనీలో మూసివేయడం వోక్స్‌వ్యాగన్‌కు ఇదే తొలిసారి కానుందని కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ప్లాంట్ల మూసివేతకు ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఐజీ మెటల్ యూనియన్ స్పష్టం చేసింది. కార్మికులు, లోయర్ సాక్సనీ రాష్ట్రంతో కలిసి చర్చల ద్వారా రాజీ కుదిరిందని తెలిపింది.

# అందుబాటు ధరలో రాయల్ ఎన్‌ఫీల్డ్ కొత్త అడ్వెంచర్ బైక్.. హిమాలయన్ 440 వచ్చేసింది!



**443 సీసీ ఇంజిన్‌తో కొత్త బైక్**

**25.4 బీహెచ్‌పీ, 34 ఎన్ఎం టార్క్**

**ఆరు గేర్ల గేర్‌బాక్స్ ఏర్పాటు**

**డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ స్టాండర్డ్**

**సెప్టెంబర్ 4 నుంచి బుకింగ్స్ ప్రారంభం**


అడ్వెంచర్ బైక్ కొనాలనుకునేవారికి రాయల్ ఎన్‌ఫీల్డ్ గుడ్‌న్యూస్ చెప్పింది. సంస్థ కొత్తగా హిమాలయన్ 440ను భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. రూ.2.29 లక్షల ఎక్స్‌షోరూమ్ ధరతో దీన్ని విడుదల చేసింది. హిమాలయన్ 450 కంటే తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ మోడల్.. హిమాలయన్ పేరుతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రయాణానికి పదేళ్లు పూర్తయిన సందర్భంగా విడుదలైంది. కొత్త హిమాలయన్ 440లో 443 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఉంది. ఇది 25.4 బీహెచ్‌పీ శక్తిని, 34 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్‌కు ఆరు గేర్ల గేర్‌బాక్స్‌ను జత చేశారు. పాత హిమాలయన్‌లో ఉన్న ఐదు గేర్లకు బదులుగా ఇది వచ్చింది. ఇంజిన్‌లో శబ్దం, వైబ్రేషన్లు తగ్గించేలా మార్పులు చేసినట్లు కంపెనీ తెలిపింది. బైక్‌లో హాఫ్ డ్యూప్లెక్స్ స్ప్లిట్ క్రేడిల్ ఫ్రేమ్‌ను ఉపయోగించారు. ముందు 41 మిల్లీమీటర్ల టెలిస్కోపిక్ ఫోర్కులు ఉన్నాయి. ఇవి 200 మిల్లీమీటర్ల ట్రావెల్‌ను అందిస్తాయి. వెనుక లింకేజ్ టైప్ మోనోషాక్ 180 మిల్లీమీటర్ల ట్రావెల్ ఇస్తుంది. ముందు 21 అంగుళాలు, వెనుక 17 అంగుళాల వైర్-స్పోక్ వీల్స్ ఉన్నాయి. హిమాలయన్ 440లో 220 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్ ఉంది. సీటు ఎత్తు 800 మిల్లీమీటర్లు. ముందు 300 మిల్లీమీటర్ల డిస్క్, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేకులు ఉన్నాయి. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ స్టాండర్డ్‌గా ఇచ్చారు. ఆఫ్-రోడ్ రైడింగ్ కోసం ఏబీఎస్‌ను వెనుక చక్రానికి ఆఫ్ చేసుకునే అవకాశం ఉంది. ఫీచర్ల విషయానికొస్తే ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, డిజిటల్-అనలాగ్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ట్రిప్పర్ నావిగేషన్, యూఎస్‌బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్ ఉన్నాయి. 15 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్ ఇచ్చారు. టూరింగ్ కోసం లగేజీ తీసుకెళ్లే సదుపాయాన్ని కూడా మెరుగుపరిచారు. సెలా బ్లాక్, మస్టాంగ్ బ్రౌన్, నెలాంగ్ వైట్ రంగుల్లో బైక్ లభిస్తుంది. తొలుత విక్రయించే బైక్‌లపై 10వ వార్షికోత్సవ ప్రత్యేక బ్యాడ్జ్ ఉంటుంది. సెప్టెంబర్ 4 నుంచి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్‌షిప్‌లతో పాటు కంపెనీ వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవచ్చు.

# రూ.1 లక్ష పెట్టుబడికి రూ.3.28 లక్షలు.. గోల్డ్ బాండ్ ఇన్వెస్టర్లకు భారీ లాభం!

సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ)లో పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభం వచ్చింది. 2021-22 సిరీస్ ౨× బాండ్ల ముందస్తు రిడెంప్షన్ ధరను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రూ.15,334గా నిర్ణయించింది. ఈ బాండ్లను 2026 సెప్టెంబర్ 7 నుంచి ముందుగానే వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. 2021 సెప్టెంబర్‌లో జారీ చేసిన ఈ ఎస్‌జీబీ సిరీస్ ఆన్‌లైన్ కొనుగోలుదారులకు గ్రాము రూ.4,682 ధరకు లభించింది. ప్రస్తుత రిడెంప్షన్ ధరతో పోలిస్తే గ్రాముకు రూ.10,652 లాభం వస్తుంది. అంటే దాదాపు 228 శాతం రాబడి. వడ్డీని ఇందులో లెక్కించలేదు.

**రూ.1 లక్ష పెడితే ఎంత?**

2021లో ఈ సిరీస్‌లో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టినట్లయితే.. బాండ్ విలువ ఇప్పుడు దాదాపు రూ.3.28 లక్షలకు చేరుతుంది. ఇది 228 శాతం మూలధన రాబడిని సూచిస్తుంది. దీనికి అదనంగా ఎస్‌జీబీపై ఏడాదికి 2.50 శాతం వడ్డీ కూడా లభిస్తుంది.



వడ్డీని ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తారు. ఐదేళ్లు పూర్తైన తర్వాత వడ్డీ చెల్లించే తేదీన మాత్రమే ఎస్‌జీబీ ముందస్తు రిడెంప్షన్ చేయవచ్చు. రిడెంప్షన్ ధరను నిర్ణయించేందుకు ముందు మూడు పనిదినాల్లో 999 స్వచ్ఛత బంగారం ముగింపు ధరల సగటును తీసుకుంటారు. సెప్టెంబర్ 7న జరగనున్న రిడెంప్షన్‌కు సెప్టెంబర్ 2, 3, 4 ధరలను పరిగణనలోకి తీసుకున్నారు. అయితే ఆన్‌లైన్ కాకుండా ఇతర మార్గాల్లో కొనుగోలు చేసిన వారికి అప్పటి జారీ ధర గ్రాముకు రూ.4,732గా ఉంది. ఆన్‌లైన్ కొనుగోలుదారులకు రూ.50 తగ్గింపు లభించింది.



# సందేశంతో ఓ అందాల రాక్షసి

స్వీయ దర్శకత్వంలో షెరాజ్ మెహదీ హీరోగా నటించిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. స్కై ఈజ్ ది లిమిట్ స్టూడియోస్ పతాకంపై సురీందర్ కౌర్ నిర్మించారు. గతంలోనే ఈ సినిమా విడుదలైంది. తాజాగా ప్రేక్షకుల అభ్యర్థన మేరకు ఈ చిత్రాన్ని ఈ నెల 24న రీరిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ఇటీవల మీడియా సమావేశాన్ని నిర్వహించారు. మహిళా ప్రధాన చిత్రమిదని, చక్కటి సందేశంతో ఆకట్టుకుంటుందని, సమాజంలో అమాయక మహిళలు ఎలా మోసపోతున్నారనే అంశాన్ని చూపించడంతో పాటు మోసాలకు పాల్పడేవారికి శిక్ష తప్పదనే సందేశాన్ని కూడా అందించామని మేకర్స్ తెలిపారు. విహాన్ని హెగాడే, కృతివర్మ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం, దర్శకత్వం: షెరాజ్ మెహదీ.



# వ్యసనం.. ఓ మానసిక రోగం

ఏ వ్యసనమైనా విలాసం కాదనీ, అది ఓ మానసిక రోగమని అంటున్నది బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్. షూటింగ్‌లతో ఎప్పుడూ బిజీగా ఉండే జాన్వీ.. సామాజిక అంశాలపైనా బాధ్యతతో వ్యవహరిస్తుంటుంది. మద్యపానం, దాని వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తుంటుంది. ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి.. మద్యపానంపై ఓ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నది. ఈ సందర్భంగా మద్యపానం, దాని వల్ల కలిగే ఇబ్బందుల గురించి కీలక వ్యాఖ్యలు చేసింది. "మద్యానికి బానిసలైన వ్యక్తులను, వారి వ్యక్తిత్వాన్ని ఎవరూ తక్కువ చేయొద్దు. నిజానికి మద్యపానంతో పాటు ఏ వ్యసనమైనా.. చెడు అలవాటు కాదు. ఒక మానసిక సమస్య మాత్రమే. ఒత్తిడి, బాధలు, వ్యక్తిగత సమస్యల వల్లే చాలామంది వాటికి అలవాటు పడతారు. అలాంటివారిని నేరస్తుల్లా కాకుండా.. రోగుల్లా చూడాలి. వారిని విమర్శించడం, దూరంగా ఉంచడం వంటివి చేయొద్దు. వారికి ప్రేమను పంచాలి. తోటివారి నుంచి సానుభూతి, మద్దతు లభిస్తేనే అలాంటి వారు త్వరగా మారతారు" అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ. మద్యపానం తన జీవితంపైనా ప్రభావం చూపిందని వెల్లడించింది. "నేను కూడా అప్పుడప్పుడూ మద్యం తీసుకునేదాన్ని. కానీ, కొన్నిరోజులకు నాకు తెలియకుండానే దానికి బానిసగా మారిపోయా! వ్యసనం అంటే మనతో ఎవరో అపరిచిత వ్యక్తి ఉనట్టే అనిపిస్తుంది. మన ప్రవర్తన పూర్తిగా మారిపోతుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కూడా జాగ్రత్తగా అడుగులు వేయాల్సి వచ్చేది. ఈ అలవాటు గురించి గతంలో నేనెప్పుడూ మాట్లాడలేదు. కానీ, నా చుట్టూ ఉన్నవాళ్లు కూడా ఈ సమస్యతో బాధపడటం చూసిన తర్వాత, ఇది మానసిక ఆరోగ్య సమస్య అని అర్థమైంది. ఈ వ్యసనం వల్ల జీవితంలో ఎన్నో కోల్పోతామనీ, ఎంతో నష్టపోతామని తెలిసిన తర్వాత.. ఏం చేయాలనే దానిపై అవగాహన వచ్చింది" అంటూ చెప్పుకొచ్చింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. దేవర చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది జాన్వీ. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన పెద్దిలో నటిస్తున్నది. ఈ సినిమా త్వరలోనే విడుదల కానున్నది.



# హారర్ థ్రిల్లర్ '418'

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్, అగ్ర దర్శకుడు ప్రశాంత్‌నీల్ భాగస్వామ్యంలో తెరకెక్కుతున్న తాజా చిత్రానికి '418' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రశాంత్‌నీల్ సమర్పకుడు. సూర్యరాజ్, హనురెడ్డి, ప్రీతి పగడాల ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. ఓ గ్రామంలోని మెడికల్ కాలేజ్ నేపథ్యంలో జరిగే కథ ఇదని, సైన్స్, మూఢనమ్మకాల మధ్య అర్థంకాని ఓ రహస్యాన్ని ఛేదించే క్రమంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వెంకీ జీ, సంభాషణలు: మోహన్ బి ఎస్, దర్శకత్వం: కీర్తన్ నాదగౌడ.



# ఒకవేళ అనుష్క అలా చేస్తే.. నిజంగా షాకింగే

హీరోయిన్ అనుష్క శెట్టి బయట కనిపించి చాలా ఏళ్లు గడిచిపోయింది. 'బాహుబలి' తర్వాత పాన్ ఇండియా క్రేజ్ వచ్చినప్పటికీ ఆచితూచి సినిమాలూ చేస్తూ వస్తోంది. అయితే 'సైజ్ జీరో' చేసిన తర్వాత ఈమెకు బరువు సమస్యలు రావడంతో మూవీస్ అయితే చేస్తోంది గానీ ప్రచారానికి మాత్రం నో చెబుతూనే వస్తోంది. గతేడాది 'ఘాటీ' చిత్రం చేసింది. దీని ప్రమోషన్‌లోనైనా కనిపిస్తుందేమోనని అంతా అనుకున్నారు. కానీ అలాంటిదేం జరగలేదు. అలాంటిది ఇప్పుడు చిత్రమైన రూమర్ వినిపిస్తోంది. అనుష్క ఇప్పటివరకు తెలుగు, తమిళంలో మాత్రమే సినిమాలు చేసింది. తొలిసారి మలయాళంలో 'కథనార్' అనే మూవీలో నటించింది. రీసెంట్‌గానే తెలుగు వెర్షన్ ట్రైలర్ కూడా రిలీజ్ చేశారు. ఇందులో స్వీటీని ఒకటి రెండు షాట్స్‌కే పరిమితం చేయడంతో ఆమె ఫ్యాన్స్ కాస్త డిసప్పాయింట్ అయ్యారు. అయితే ఎప్పుడూ లేని విధంగా ఈ చిత్ర ప్రచారానికి అనుష్క.. ఏకంగా హైదరాబాద్ వస్తుందని టాక్ వినిపిస్తోంది. కానీ ఆడియెన్స్ మాత్రం నమ్మట్లేదు. ఎందుకంటే తెలుగులో నేరుగా సినిమాలు చేసినప్పుడే వాటిని ప్రమోట్ చేసేందుకు బయటకు రాలేదు. అలాంటిది ఓ మలయాళ డబ్బింగ్ చిత్రం కోసం హైదరాబాద్ వస్తుందా? సందేహమే అని మాట్లాడుకుంటున్నారు. ఈ ఏడాది ద్వితియార్ధంలోనే మూవీ థియేటర్లలోకి వస్తుందని అధికారికంగా ప్రకటించారు. కానీ ఏ నెల అనేది మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. 9వ శతాబ్దానికి చెందిన కథనార్ అనే క్రైస్తవ మతప్రచారకుడి జీవితం ఆధారంగా దీన్ని తెరకెక్కిస్తున్నారు.



# కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందన్న హన్సిక

తెలుగు, తమిళ చిత్రాలతో 'యాపిల్ బ్యూటీ'గా పేరు తెచ్చుకున్న హన్సిక, తన విడాకుల వార్తలపై ఎట్టకేలకు మౌనం వీడారు. భర్త సోహెల్ కతురియాతో నాలుగేళ్ల బంధానికి స్వస్తి పలుకుతూ ముంబై కోర్టులో విడాకులు తీసుకున్నట్లు వస్తున్న వార్తలపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. "మనం తప్పు ట్రైన్ ఎక్కామని తెలిసినప్పుడు, వీలైనంత త్వరగా దిగిపోవడమే మంచిది" అంటూ వైవాహిక బంధం ముగియడంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తన నిర్ణయం పట్ల తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆమె స్పష్టం చేశారు. జనాలకు హెడ్ లైన్స్, క్లిక్ బైట్స్ కావాలి కానీ, తనకు వ్యక్తిగత ప్రశాంతత అంతకంటే ముఖ్యమని హన్సిక పేర్కొన్నారు. విడాకుల తర్వాత మానసిక ప్రశాంతత కోసం జపాన్ వెళ్లి వచ్చానని, ఈ కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందని తెలిపారు. 2022లో అట్టహాసంగా జరిగిన ఈ వివాహం, ఓటీటీలో డాక్యుమెంటరీగా కూడా విడుదలైంది. అప్పట్లో హన్సిక తన స్నేహితురాలి మాజీ భర్త అయిన సోహెల్ ను పెళ్లాడడం చర్చనీయాంశం అయింది. ఇప్పుడు వీరిద్దరి బంధం కూడా ముగియడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏదేమైనా, తన శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తూ హన్సిక తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com